STv SAMAYAM

epaper.samayamdaily.net

APTEL/26/A3949

సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

సమయం

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

7036644111, 9490140565

సంపుటి: 1 | సంచిక: 125 | ఎడిటర్ : అలీ ముర్తుజా | గురువారం 19 నవంబర్ 2026 | ప్రచురణ : విజయవాడ | పేజీలు: 8 | వెల: రూ.5 |



కుల్గాంలో ఎన్‌కౌంటర్
లష్కరే ఉగ్రవాది హతం!

- భద్రతా బలగాల కాల్పుల్లో లతీఫ్ భట్ మృతి

4

బర్డ్‌ఫ్లూ నియంత్రణకు తొలి స్వదేశీ టీకా


- నేడు దేశానికి అంకితం

4



జంతుబలుల నిషేధానికి సుప్రీంకోర్టు నో!

- మతపరమైన వేడుకల్లో జంతువధను నిషేధించాలంటూ పిటిషన్
- వాదనలు విన్న అనంతరం వ్యాజ్యం కొట్టివేత




4

ముంచుకొస్తున్న..
అక్వాన్ ముప్పు!



- నరసాపురం-పూరీ, నెల్లూరు-విశాఖ మధ్య తీరం దాటే ఛాన్స్
- తీరం దాటే సమయంలో గంటకు 145 కి.మీ వేగంతో పెనుగాలులు
- కోస్తా జిల్లాల్లో రెండు రోజుల పాటు అత్యంత భారీ వర్షాలు
- రంగంలోకి 13 ఎన్డీఆర్ఎఫ్, 11 ఎస్డీఆర్ఎఫ్ బృందాలు
- ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వెల్లడించిన ఆర్టీజీఎస్

బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా మారిన అక్వాన్



బంగాళాఖాతంలో పురుడుపోసుకున్న 'అక్వాన్' తుపాను తీవ్రరూపం దాల్చి ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాలపై పంజా విసిరేందుకు శరవేగంగా దూసుకొస్తోంది. గంటకు 120 నుంచి గరిష్ఠంగా 145 కిలోమీటర్ల వేగంతో భయానక ఈదురుగాలులు సృష్టిస్తూ.. శుక్రవారం మధ్యాహ్నానికి నరసాపురం-పూరీ మధ్య తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఈ పెను తుపాను ప్రభావంతో రానున్న రెండు రోజుల పాటు కోస్తా జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉండటంతో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఆర్టీజీఎస్) యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ప్రజలను రక్షించేందుకు ఎప్పటికప్పుడు ముందస్తు హెచ్చరికలు జారీ చేస్తూ.. క్షేత్రస్థాయిలో అత్యవసర సహాయక చర్యల కోసం ఏకంగా 13 ఎన్డీఆర్ఎఫ్, 11 ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది.

- అమరావతి, నవంబర్ 18 (సమయం న్యూస్):

వివరాలు 2లో..

తుపాను వేళ 48 గంటలు కీలకం

ముందస్తు చర్యలపై హోంమంత్రి అనిత సమీక్ష




వివరాలు 2లో..



విద్యుత్ సేవలకు ఆటంకం రావొద్దు

నెల్లూరు నుంచి విశాఖ వరకు ప్రత్యేక నిఘా

మూడు డిస్కంల అధికారులతో మంత్రి గొట్టిపాటి సమీక్ష



డిమాండ్‌కు తగ్గట్టు విద్యుత్ సరఫరా

ఆరు నెలల్లో 14,852 మెగావాట్లకు చేరనున్న వినియోగం

- ఇంధన శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష
- రూ.21,838 కోట్లతో గ్రీన్ ఎనర్జీ కారిడార్-3 ప్రణాళిక
- పంప్డ్ స్టోరేజ్ ద్వారా 36,050 మెగావాట్ల ఉత్పత్తి లక్ష్యం

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో అనూహ్యంగా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ వచ్చే ఆరు నెలల్లో 14,852 మెగావాట్లకు చేరనున్న నేపథ్యంలో, దానికి అనుగుణంగా సరఫరా వ్యవస్థను పటిష్టం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇంధన శాఖ అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా రూ.21,838 కోట్లతో గ్రీన్ ఎనర్జీ కారిడార్-3 నిర్మాణం, 36,050 మెగావాట్ల సామర్థ్యంతో పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రభుత్వం భారీ ప్రణాళికలు సిద్ధం చేసింది.

- అమరావతి, నవంబర్ 18 (సమయం న్యూస్):

2



రాప్తాడు బాలిక ఓ ఫైటర్

- మణిపాల్ వైద్యులతో మంత్రి నారా లోకేష్ వీడియో కాన్ఫరెన్స్
- వెంటిలేటర్ లేకుండానే శ్వాస.. నెమ్మదిగా నడుస్తున్న చిన్నారి
- డిశ్చార్జ్ తర్వాతా ప్రత్యేక వైద్య సంరక్షణ కల్పిస్తామని భరోసా
- బాలిక ప్రాణాలు కాపాడిన వైద్య బృందానికి మంత్రి కృతజ్ఞతలు

3

సమగ్ర బీసీ కులగణన చేపట్టాలి

- ఈనెల 28న ఢిల్లీ రాంలీలా మైదాన్‌లో భారీ సభ
- హాజరు కావాలని వైయస్ జగన్‌కు కమిటీ ఆహ్వానం
- తాడేపల్లిలో భేటీ అయిన అఖిల భారత కులగణన ప్రతినిధులు

వివరాలు 3లో..





స్థానిక తీర్పుతో మా బాధ్యత పెరిగింది

- 23 మున్సిపాలిటీలు, పంచాయతీల్లోనూ కూటమిని ఆశీర్వదించాలి
- యువ నాయకత్వానికి ప్రాధాన్యమిచ్చామన్న నాదెండ్ల మనోహర్
- గత పాలనపై అసంతృప్తే ఫలితాల్లో కనిపించిందని ఆరోపణ
- మంగళగిరిలో నేతల ఉమ్మడి సమావేశం

3లో..

టాప్ 300లో వీఐటీకి చోటు

- క్యూఎస్ సస్టైనబిలిటీ ర్యాంకింగ్స్‌లో 293వ ర్యాంకు
- భారత్‌లో 5వ స్థానంలో నిలిచిన విశ్వవిద్యాలయం

2



ఎంబీబీఎస్‌లో 99.88 శాతం భర్తీ

- భర్తీ అయిన వాటిలో 61.34 శాతం విద్యార్థినులకే
- ప్రభుత్వ వైద్య కళాశాలల్లో వంద శాతం ప్రవేశాలు పూర్తి

3



తుపాను వేళ 48 గంటలు కీలకం

ముందస్తు చర్యలపై హోంమంత్రి అనిత సమీక్ష

శ్రీకాకుళంఉదక్షిణ ఒడిశా మధ్య తీరం దాటే అవకాశం

సహాయక చర్యలకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధం

అత్యవసరమైతే తప్ప తీర ప్రాంత ప్రజలు బయటకు రావొద్దు

అమరావతి, నవంబర్ 18 (సమయం న్యూస్) : అక్వాన్ తీవ్ర తుపాను నేపథ్యంలో రానున్న 48 గంటల పాటు అన్ని శాఖల అధికారులు పూర్తి సంసిద్ధతతో ఉండి, ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని హోంమంత్రి అనిత ఆదేశించారు. తుపాను ప్రభావం, సహాయక చర్యలపై ఆమె అధికారులతో సమీక్ష నిర్వహించారు. గంటకు 8 కిలోమీటర్ల వేగంతో కదులుతున్న తుపాను ఎల్లుండి మధ్యాహ్నానికి శ్రీకాకుళంఉదక్షిణ ఒడిశా ప్రాంతాల్లో తీరం దాటే అవకాశం ఉందని, ఆ సమయంలో 100 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని అధికారులు వివరించారు. దీని ప్రభావంతో రేపు ఉత్తరాంధ్రలో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయన్నారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు 13 ఎన్డీఆర్ఎఫ్, 11 ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక బృందాలను సిద్ధంగా ఉంచామని, జిల్లా, మండల నియంత్రణ కేంద్రాలు 24 గంటలూ పనిచేయాలని హోంమంత్రి స్పష్టం చేశారు. తీర ప్రాంత ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని, లోతట్టు ప్రాంతాల వారు పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని సూచించారు. రైతులు వ్యవసాయ పనుల్లో జాగ్రత్తలు తీసుకోవాలని, తెగిపడిన విద్యుత్ తీగల దగ్గరకు వెళ్లొద్దని కోరారు. వదంతులు నమ్మకుండా అధికారిక హెచ్చరికలనే విశ్వసించాలన్నారు. అత్యవసర సహాయం కోసం 112, 1070, 18004250101 నంబర్లను, విద్యుత్ అంతరాయం, చెట్లు కూలడం లాంటి సమస్యలపై 'మన మిత్ర' వాట్సాప్ నంబరు 9552300009ను సంప్రదించాలని అనిత తెలిపారు.



విద్యుత్ సేవలకు ఆటంకం రావొద్దు

నెల్లూరు నుంచి విశాఖ వరకు ప్రత్యేక నిఘా

మూడు డిస్కంల అధికారులతో మంత్రి గొట్టిపాటి సమీక్ష

అదనపు సిబ్బంది, సామగ్రి కోసం తెలంగాణ మంత్రికి లేఖ

సరఫరా దెబ్బతింటే వెంటనే పునరుద్ధరించాలని ఆదేశం



అమరావతి, నవంబర్ 18 (సమయం న్యూస్): అక్వాన్ తుపాను నేపథ్యంలో విద్యుత్ వ్యవస్థకు నష్టం వాటిల్లకుండా పకడ్బందీ ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. నెల్లూరు నుంచి విశాఖపట్నం వరకు తీర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గంటకు 120 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్నందున మూడు డిస్కంల ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర సామగ్రిని ముందుగానే అందుబాటులో ఉంచుకోవాలని, అత్యవసర మరమ్మతుల కోసం సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అదనపు సిబ్బంది, సామగ్రి కోసం తెలంగాణ విద్యుత్ శాఖ మంత్రికి ఇప్పటికే లేఖ రాసినట్లు వెల్లడించారు. గతంలో అర్నాబ్, మురసు తుపానుల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని సహాయక చర్యలకు ప్రణాళిక రూపొందించాలని మంత్రి సూచించారు. స్తంభాలు కూలిపోయినా, సరఫరా వ్యవస్థ దెబ్బతిన్నా యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టాలన్నారు. ప్రతి జిల్లాకు ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబరు ఏర్పాటు చేసి, ఫిర్యాదులను నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. శాఖాపరమైన నిర్లక్ష్యంతో ఎలాంటి నష్టం జరగడానికి వీల్లేదని, ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లకుండా సిబ్బంది పనిచేయాలని స్పష్టం చేశారు. ముందు జాగ్రత్తగా సరఫరా నిలిపివేసినా, తుపాను వల్ల అంతరాయం ఏర్పడినా వినియోగదారులకు ముందుగానే సమాచారం అందించాలని ఆదేశించారు.

జగన్‌కు మానవీయ విలువలు ఒంటబట్టవు

పెనుకొండలో మంత్రి ఎస్. సవిత ఆగ్రహం

పెనుకొండ, నవంబర్ 18 (సమయం న్యూస్) : జగన్‌కు అధికారం, డబ్బే తప్ప మానవీయ విలువలు, రక్త సంబంధాలు ఒంటబట్టవని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత విరుచుకుపడ్డారు. బుధవారం శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. తండ్రి సమానులైన సీఎం చంద్రబాబును కలిసి వైఎస్ షర్మిల తన కుమార్తె వివాహ ఆహ్వానపత్రిక ఇవ్వడాన్ని తప్పుబడుతూ జగన్ మీడియా ప్రచురించిన కథనంపై మండిపడ్డారు. జగన్‌కు తెలిసే రాసిన ఆ వార్తతో సొంత చెల్లెలిని మాత్రమే కాకుండా యావత్తు రాష్ట్ర మహిళలను కించపరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సాక్షిగా నారా భువనేశ్వరిని దూషించినప్పుడు పైశాచిక ఆనందం పొందారని, బెంగళూరు యలహంక ప్యాలెస్‌లో సొంత మేనకోడలి పెళ్లి జరగకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. గతంలో విజయమ్మను విమర్శించిన వారే నేడు జగన్ చుట్టూ ఉన్నారన్నారు. సాధారణ, స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలే ఆయనకు బుద్ధి చెప్పారని, రాబోయే పంచాయతీ ఎన్నికల్లోనూ గుణపాఠం చెప్పడం ఖాయమని స్పష్టం చేశారు.

జర్నలిజం విలువలు దిగజార్చిన నీలి మీడియా

ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టే ఉన్నతమైన మీడియా రంగాన్ని నీలి మీడియా భ్రష్టుపట్టిస్తోందని మంత్రి సవిత విమర్శించారు. ఇటీవలే కేంద్ర హోంమంత్రి అమిత్ షా జర్నలిజం గొప్పతనాన్ని కొనియాడారని, అందుకు విరుద్ధంగా తప్పుడు కథనాలతో ఆ మీడియా అబద్ధానికి మారుపేరుగా నిలిచిందని మండిపడ్డారు. బాబాయ్‌ను చంపి 'నారాసుర రక్తచరిత్ర' అంటూ చంద్రబాబుపై నెట్టే ప్రయత్నం చేశారని గుర్తుచేశారు. జగన్ కన్నుసన్నల్లో, భారతి నేతృత్వంలో నడుస్తున్న మీడియాలో సొంత చెల్లెలిపై తప్పుడు వార్త రాయడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ఆ సంస్థ రిపోర్టర్లు ఆలోచించి మహిళలపై తప్పుడు కథనాలు రాయడం మానుకోవాలని సవిత హితవు పలికారు.

ముంచుకొస్తున్న.. అక్వాన్ ముప్పు!

- బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా మారిన అక్వాన్
- నరసాపురం-పూరీ, నెల్లూరు-విశాఖ మధ్య తీరం దాటే ఛాన్స్
- తీరం దాటే సమయంలో గంటకు 145 కి.మీ వేగంతో పెనుగాలులు
- కోస్తా జిల్లాల్లో రెండు రోజుల పాటు అత్యంత భారీ వర్షాలు
- రంగంలోకి 13 ఎన్డీఆర్ఎఫ్, 11 ఎస్డీఆర్ఎఫ్ బృందాలు

అమరావతి, నవంబర్ 18 (సమయం న్యూస్) : బంగాళాఖాతంలో ఏర్పడిన అక్వాన్ తీవ్ర తుపాన్ క్రమంగా ముందుకు కదులుతూ కోస్తా, ఉత్తరాంధ్ర ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. గడిచిన ఆరు గంటల్లో గంటకు 8 కిలోమీటర్ల వేగంతో పయనిస్తున్న ఈ తుపాన్.. ఎల్లుండి మధ్యాహ్నానికి నరసాపురం-పూరీ మధ్య ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరాలను తీవ్ర తుపాన్‌గా దాటే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) ఎండీ, ఆర్టీజీఎస్ సీఈవో ప్రఖర్ జైన్ వెల్లడించారు. సోమవారం మధ్యాహ్నం నాటికి ఈ తుపాన్ నరసాపురానికి 540 కి.మీ, చెన్నైకి 570 కి.మీ, కళింగపట్నానికి 600 కి.మీ, గోపాల్‌పూర్‌కు 690 కి.మీ, పూరీకి 770 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉందని తెలిపారు. తీరం దాటే సమయంలో గంటకు 100 నుంచి 120 కిలోమీటర్లు, గరిష్ఠంగా 145 కిలోమీటర్ల వేగంతో అత్యంత బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని విపత్తుల సంస్థ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది.



అత్యంత భారీ వర్షాలు.. యంత్రాంగం అప్రమత్తం..

తుపాన్ ప్రభావంతో కోస్తా జిల్లాల్లో గురు, శుక్రవారాల్లో కొన్నిచోట్ల అత్యంత భారీ వర్షాలు, అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆర్టీజీఎస్ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజలు తీవ్ర అప్రమత్తంగా ఉండాలని సూచించింది. రైతులు వ్యవసాయ పనుల్లో కచ్చితంగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేసింది. మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లోనూ సముద్రంలోకి వేటకు వెళ్లకూడదని, తమ పడవలను సురక్షిత ప్రాంతాల్లో గట్టిగా కట్టేయాలని హెచ్చరించింది. విపత్తుల నిర్వహణ సంస్థ సమన్వయంతో తుపాన్ పయనాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎప్పటికప్పుడూ జిల్లా యంత్రాంగాలకు తగిన సూచనలు జారీ చేస్తున్నారు. అత్యవసర సహాయక చర్యల కోసం ఇప్పటికే 13 ఎన్డీఆర్ఎఫ్, 11 ఎస్డీఆర్ఎఫ్, స్థానిక అగ్నిమాపక బృందాలను సర్వసన్నద్ధంగా సిద్ధం ఉంచారు.

సమస్య ఎదురైతే.. ఫోన్ చేయండి..

తుపాన్ వార్తలతో ప్రజలు ఎలాంటి పుకార్లను నమ్మవద్దని, భయాందోళనకు గురికావొద్దని, ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందని ఆర్టీజీఎస్ సీఈవో ప్రఖర్ జైన్ భరోసా ఇచ్చారు.

ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవే..

- తుపానుకు ముందు మొబైల్ ఫోన్లను ఫుల్ ఛార్జ్ చేసి ఉంచుకోవాలి. వాతావరణ శాఖ ఇచ్చే అప్‌డేట్స్ గమనిస్తుండాలి.
- విలువైన పత్రాలు, సర్టిఫికెట్లను వాటర్ ప్రూఫ్ కవర్లలో భద్రపరుచుకోవాలి. కనీసం ఒక వారానికి సరిపడా ఆహారం, తాగునీరు సిద్ధం చేసుకోవాలి.
- తుపాను సమయంలో ఇంట్లో ఉన్నవారు ఎలక్ట్రికల్ మెయిన్ స్విచ్ ఆఫ్ చేయాలి. గ్యాస్ కనెక్షన్లు తొలగించి, కిటికీలు గట్టిగా మూసేయాలి.
- ఇల్లు సురక్షితంగా లేదని భావిస్తే ముందే పునరావాస కేంద్రాలకు చేరుకోవాలి. కేవలం కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలి.
- వరద ముప్పు ఉన్న లోతట్టు ప్రాంతాల ప్రజలు.. అధికారులు చెప్పిన వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి.
- దెబ్బతిన్న భవనాలు, భారీ వృక్షాలు, హోర్డింగ్స్, విద్యుత్ స్తంభాల కింద నిలబడకూడదు. తెగిపడిన విద్యుత్ తీగలతో జాగ్రత్తగా ఉండాలి.
- నీటిలో తడిసిన ఎలక్ట్రానిక్ వస్తువులను ఎలక్ట్రీషియన్ చేత తనిఖీ చేయించిన తర్వాతే ఉపయోగించాలి.

తుపాను వల్ల ఏ సమస్య ఎదురైనా తక్షణమే 9552300009 మొబైల్ నంబర్ (మన మిత్ర) ద్వారా అధికారులకు తెలియజేయవచ్చని సూచించారు. అత్యవసర సహాయం, సమాచారం కోసం విపత్తుల నిర్వహణ సంస్థలోని 112, 1070, 18004250101 టోల్ ఫ్రీ నంబర్లను సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

డిమాండ్‌కు తగ్గట్టు విద్యుత్ సరఫరా

- ఆరు నెలల్లో 14,852 మెగావాట్లకు చేరనున్న వినియోగం
- ఇంధన శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష
- రూ.21,838 కోట్లతో గ్రీన్ ఎనర్జీ కారిడార్-3 ప్రణాళిక
- పంప్డ్ స్టోరేజ్ ద్వారా 36,050 మెగావాట్ల ఉత్పత్తి లక్ష్యం

అమరావతి, నవంబర్ 18 (సమయం న్యూస్): రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఇంధన శాఖపై బుధవారం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. గత రెండున్నరేళ్లలో ఇంధన రంగంలో వచ్చిన పెట్టుబడులు, కొత్త ప్రాజెక్టుల పురోగతి, ఎల్‌నినో ప్రభావంతో పెరిగిన వినియోగం, సరఫరా పరిస్థితులపై సీఎం సమీక్షించారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్-3, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు, ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు, విశాఖ సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో వచ్చిన పెట్టుబడులపై చర్చించారు. వచ్చే ఆరు నెలల్లో రాష్ట్ర విద్యుత్ డిమాండ్ 14,852 మెగావాట్లకు చేరే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు గత ఏడాదితో పోలిస్తే విద్యుత్ డిమాండ్ 18.23 శాతం పెరిగిందని తెలిపారు.



గ్రీన్ కారిడార్.. పంప్డ్ స్టోరేజ్‌పై దృష్టి

గ్రీన్ ఎనర్జీ కారిడార్-3 కింద రూ.21,838 కోట్లతో భారీ విద్యుత్ సరఫరా వ్యవస్థను అభివృద్ధి చేయాలని ప్రణాళికలు రూపొందించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కారిడార్ ద్వారా 47 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్‌ను సరఫరా చేసే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో 36,050 మెగావాట్ల సామర్థ్యంతో పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ఏర్పాటును లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇందుకోసం పోలవరం పరిసరాల్లో 27 ప్రాజెక్టుల ప్రాంతాలను గుర్తించామని వివరించారు. జూన్ 2024 నుంచి ఇప్పటివరకు విద్యుత్ రంగంలో 103 ప్రాజెక్టులకు ఆమోదం లభించిందని, వీటి ద్వారా రూ.4.20 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయని పేర్కొన్నారు. విశాఖ సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో విద్యుత్ రంగానికి సంబంధించి రూ.2.56 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరినట్లు వెల్లడించారు.

సౌర విద్యుత్ విస్తరణలో ముందడుగు

ప్రభుత్వ సంక్షేమ పాఠశాలలు, హాస్టళ్లలో రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేసి 2,962 విద్యాసంస్థలను సౌర విద్యుత్ పరిధిలోకి తీసుకురావాలని ప్రణాళిక రూపొందించారు. పీఎం సూర్య ఘర్ పథకం అమలులో ఆంధ్రప్రదేశ్ దేశంలో నాలుగో స్థానంలో నిలిచిందని, ఇప్పటివరకు 7.42 లక్షలకు పైగా రూఫ్‌టాప్ సోలార్ ఇన్‌స్టాలేషన్లు పూర్తయ్యాయని అధికారులు వివరించారు. ఈ నెలాఖరుకు 9 లక్షల కనెక్షన్లు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. పీఎం కుసుమ్ పథకం కింద 224 ప్రాంతాల్లో 1,162 మెగావాట్ల సామర్థ్యంతో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయని, ఈ ప్రాజెక్టులకు భూసేకరణ 100 శాతం, సివిల్ పనులు 91 శాతం పూర్తయ్యాయని ముఖ్యమంత్రికి వివరించారు.

ప్రపంచ టాప్ 300లో వీఐటీకి చోటు

- క్యూఎస్ సస్టైనబిలిటీ ర్యాంకింగ్స్‌లో 293వ ర్యాంకు
- భారత్‌లో 5వ స్థానంలో నిలిచిన విశ్వవిద్యాలయం
- గత ఏడాది కంటే 59 స్థానాలు మెరుగుపరుచుకున్న వర్సిటీ
- పర్యావరణహిత చర్యలే కారణమన్న ఛాన్సలర్ విశ్వనాథన్

వేలూరు, నవంబర్ 18 (సమయం న్యూస్): వేలూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ) మరో అరుదైన ఘనత సాధించింది. క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌ఉసస్టైనబిలిటీ 2027లో ప్రపంచవ్యాప్తంగా 293వ ర్యాంకు, భారతదేశంలో 5వ స్థానాన్ని దక్కించుకుంది. ఈ ర్యాంకింగ్స్‌లో వర్సిటీ 81.2 ఓవరాల్ స్కోర్ సాధించినట్లు వీఐటీ ఛాన్సలర్ డాక్టర్ జి. విశ్వనాథన్ ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో 352వ స్థానంలో ఉన్న వీఐటీ ఈసారి ఏకంగా 59 స్థానాలు మెరుగుపరుచుకుని ప్రపంచంలోని టాప్ 300 విశ్వవిద్యాలయాల జాబితాలో చోటు సంపాదించింది. గత ఏడాది భారత్‌లో 7వ స్థానంలో నిలవగా, ఈసారి 5వ స్థానానికి ఎగబాకింది. 2027 ఎడిషన్‌లో ప్రపంచవ్యాప్తంగా సుమారు 2,000 విశ్వవిద్యాలయాలను పర్యావరణ ప్రభావం, సామాజిక ప్రభావం, పాలన అనే మూడు ప్రధాన అంశాల ఆధారంగా అంచనా వేశారు.



సౌర విద్యుత్.. వ్యర్థాల నుంచి ఇంధనం

క్యాంపస్‌లో అమలు చేస్తున్న పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి కార్యక్రమాలే ఈ మెరుగైన ర్యాంకుకు కారణమని డాక్టర్ విశ్వనాథన్ వివరించారు. వాహనాల పార్కింగ్ ప్రదేశాలపై ఏర్పాటు చేసిన 441 కిలోవాట్ల సామర్థ్యం గల సౌర విద్యుత్ ప్యానెళ్ల ద్వారా ఏటా 650 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోందని, దీనివల్ల సుమారు 470 టన్నుల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలను నివారించగలుగుతున్నామని తెలిపారు. విద్యార్థుల హాస్టళ్లలో ఉత్పత్తయ్యే ఆహార వ్యర్థాలను రీసైక్లింగ్ చేసి 200 కిలోవాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ఏటా సుమారు 15 టన్నుల కలప వ్యర్థాలను బయో ఎనర్జీగా మారుస్తున్నట్లు వెల్లడించారు.

ప్లాస్టిక్‌పై నిషేధం.. జీవవైవిధ్యానికి పెద్దపీట

క్యాంపస్‌లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై కఠిన నిషేధం అమలు చేస్తున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు. పచ్చదనం, పెద్ద సంఖ్యలో చెట్లతో నిండిన వీఐటీ ప్రాంగణం స్థానిక, కాలానుగుణ పక్షి జాతులకు అనుకూలమైన ఆవాసంగా నిలుస్తోందని తెలిపారు. ప్రపంచంలోని టాప్ 300 విశ్వవిద్యాలయాల్లో చోటు దక్కించుకోవడం పర్యావరణహిత క్యాంపస్ నిర్వహణ, స్వచ్ఛమైన ఇంధన వినియోగం, వ్యర్థాల నిర్వహణ, జీవవైవిధ్య పరిరక్షణ పట్ల వర్సిటీకి ఉన్న నిబద్ధతకు నిదర్శనమని స్పష్టం చేశారు.

సమగ్ర బీసీ కులగణన చేపట్టాలి

- ఈనెల 28న ఢిల్లీ రాంలీలా మైదాన్‌లో భారీ సభ
- హాజరు కావాలని వైయస్ జగన్‌కు కమిటీ ఆహ్వానం
- తాడేపల్లిలో భేటీ అయిన అఖిల భారత కులగణన ప్రతినిధులు



తాడేపల్లి, నవంబర్ 18 (సమయం న్యూస్): ఓబీసీలతో పాటు సమగ్ర బీసీ కులగణన నిర్వహించి, వెనుకబడిన వర్గాలకు అన్యాయం జరగకుండా చూడాలని డిమాండ్ చేస్తూ ఈనెల 28న ఢిల్లీలోని రాంలీలా మైదాన్‌లో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నట్లు అఖిల భారత కులగణన సమన్వయ కమిటీ ప్రతినిధులు వెల్లడించారు. 'ఛలో రాంలీలా మైదాన్' పేరుతో నిర్వహిస్తున్న ఈ సభకు సంఘీభావం ప్రకటించి, వ్యక్తిగతంగా హాజరు కావాలని కోరుతూ వారు తాడేపల్లిలోని వైయస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్‌ను కలిసి ఆహ్వానించారు.

భేటీలో పాల్గొన్న ప్రతినిధులు

వైయస్ జగన్‌ను కలిసిన వారిలో మండల్ కమిషన్ ఛైర్మన్‌గా పనిచేసిన బీపీ మండల్ మనవడు, ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సూరజ్ మండల్, అఖిల భారత ఓబీసీ విద్యార్థుల సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ గౌడ్ కిరణ్‌కుమార్, సకల్ ఓబీసీ మహామోర్చా అధ్యక్షుడు ఉమేష్ కుర్రం, డాక్టర్ పిట్టి మల్లికార్జున్ యాదవ్ ఉన్నారు. వీరితో పాటు అఖిల భారత ఓబీసీ విద్యార్థుల సంఘం నాయకులు రాకేష్ దత్తా, పెండెం జయంతి యాదవ్, రజనీకాంత్ గౌడ్ కూడా వైయస్ జగన్‌ను కలిశారు. ఈ సమావేశంలో వైయస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. భేటీ అనంతరం కమిటీ ప్రతినిధులు పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు.

రాప్తాడు బాలిక ఓ ఫైటర్

- మణిపాల్ వైద్యులతో మంత్రి నారా లోకేష్ వీడియో కాన్ఫరెన్స్
- వెంటిలేటర్ లేకుండానే శ్వాస.. నెమ్మదిగా నడుస్తున్న చిన్నారి
- డిశ్చార్జ్ తర్వాతా ప్రత్యేక వైద్య సంరక్షణ కల్పిస్తామని భరోసా
- బాలిక ప్రాణాలు కాపాడిన వైద్య బృందానికి మంత్రి కృతజ్ఞతలు



అమరావతి, నవంబర్ 18 (సమయం న్యూస్): రాప్తాడు దాడిలో తీవ్రంగా గాయపడి బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలిక వేగంగా కోలుకుంటోందని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఆ బాలిక ఒక ఫైటర్ అని, ఎంతో ధైర్యంగా ప్రాణాలతో పోరాడి ఇప్పుడు అదే ఆత్మవిశ్వాసంతో కోలుకుంటోందని పేర్కొన్నారు. త్వరలోనే ఆరోగ్యంగా ఇంటికి తిరిగి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. శారీరకంగా, మానసికంగా పూర్తిగా కోలుకుని సాధారణ జీవితం గడిపే వరకు తాను అండగా ఉంటానని బాలిక కుటుంబానికి భరోసా ఇచ్చారు. బుధవారం ఉండవల్లిలోని తన నివాసం నుంచి మణిపాల్ ఆసుపత్రి వైద్యులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి.. చికిత్స తీరు, ఆరోగ్యంలో వస్తున్న మార్పులు, డిశ్చార్జ్ అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

మళ్లీ నవ్వుతోంది.. నడుస్తోంది

బాలిక ఆరోగ్యంలో గణనీయమైన మెరుగుదల కనిపిస్తోందని వైద్యులు మంత్రికి వివరించారు. ప్రస్తుతం వెంటిలేటర్ అవసరం లేకుండానే శ్వాస తీసుకుంటోందని, ఆక్సిజన్ స్థాయిలు స్థిరంగా ఉన్నాయని తెలిపారు. నోటి ద్వారా ఆహారం తీసుకుంటోందని, ప్రధాన గాయాలు మానిపోవడంతో కుట్లు తొలగించి చిన్నపాటి గాయాలకు చికిత్స కొనసాగిస్తున్నామని చెప్పారు. ఇతరుల సహాయంతో నెమ్మదిగా నడుస్తోందని, కుడిచేత్తో నీళ్ల గ్లాసు పట్టుకునే స్థాయికి చేరుకుందని వెల్లడించారు. పెన్ను పట్టుకుని రాయడానికి అవసరమైన శిక్షణ ప్రారంభించామని, గత విషయాలను గుర్తుచేసుకోగలుగుతోందని పేర్కొన్నారు. రెండు రోజుల క్రితం నవ్వమని అడిగితే నవ్విందని, ఆమెలో ఆత్మవిశ్వాసం పెరుగుతోందని వైద్యులు చెప్పడంతో లోకేష్ భావోద్వేగానికి గురయ్యారు.

డిశ్చార్జ్‌తో బాధ్యత ముగియదు

చిన్న వయసులోనే బాలిక ఎదుర్కొన్న బాధను మాటల్లో చెప్పలేమని మంత్రి లోకేష్ ఆవేదన వ్యక్తం చేశారు. శారీరక గాయాలు మానిపోయినా మానసికంగా కోలుకోవడానికి సమయం పడుతుందని, వైద్య చికిత్సతో పాటు ప్రేమ, ఆప్యాయత, మానసిక ధైర్యం అందించడం ముఖ్యమని పేర్కొన్నారు. బాలిక మళ్లీ స్వేచ్ఛగా నడవాలని, తన చేతులతో రాయాలని, తోటి పిల్లలతో కలిసి సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. ఆమె కలలను నెరవేర్చుకునేలా ఎదిగేందుకు అవసరమైన ప్రతి సహాయాన్ని అందిస్తామని, ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయినంత మాత్రాన తమ బాధ్యత ముగిసిపోదని స్పష్టం చేశారు.

ఇంటికి వెళ్లాకా ప్రత్యేక వైద్య సంరక్షణ

బాలిక త్వరలోనే ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉందని, ఆ తర్వాత కూడా పునరావాస చికిత్స, మానసిక మద్దతు, తదుపరి శస్త్రచికిత్సలు కొనసాగించాల్సి ఉంటుందని వైద్యులు తెలిపారు. దీనిపై స్పందించిన మంత్రి.. బాలిక ఇంటికి వెళ్లిన తర్వాత కూడా వైద్య సంరక్షణలో ఎలాంటి లోటు లేకుండా ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. స్థానికంగా మానసిక వైద్య నిపుణుడిని అందుబాటులో ఉంచడంతో పాటు, అనంతపురం సర్వజన ఆసుపత్రి సహకారంతో పునరావాస చికిత్సకు ప్రత్యేక థెరపిస్ట్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆర్థోపెడిక్ చికిత్స, ఫిజియోథెరపీ, భవిష్యత్తు శస్త్రచికిత్సలపై సమగ్ర ప్రణాళిక రూపొందించాలని మణిపాల్ వైద్యులను కోరారు. ఇంటి వద్ద ఇన్ఫెక్షన్లు, ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

వైద్య బృందానికి కృతజ్ఞతలు

చిన్నారి ప్రాణాలను కాపాడి, ఆ కుటుంబంలో మళ్లీ ఆశలు చిగురించేలా చేసిన మణిపాల్ వైద్య బృందానికి మంత్రి లోకేష్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అనంతపురంలో సకాలంలో ప్రాథమిక చికిత్స అందించిన వైద్యుల సేవలను ప్రత్యేకంగా ప్రశంసించారు. వైద్య బృందంలోని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ డాక్టర్ బాలికతో తెలుగులో మాట్లాడుతూ ఆమెకు, తల్లిదండ్రులకు ధైర్యం చెబుతున్నారని వైద్యులు వివరించారు. బాలిక కోలుకుంటున్న తీరుపై తల్లిదండ్రులు సంతోషంగా ఉన్నారని, మొదటి నుంచి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న మంత్రి లోకేష్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారని వెల్లడించారు.

ఎంబీబీఎస్ సీట్లలో 99.88 శాతం భర్తీ

- రాష్ట్ర కోటాలో 6,937 సీట్లకు 6,929 సీట్లు నిండాయి
- భర్తీ అయిన వాటిలో 61.34 శాతం విద్యార్థినులకే
- ప్రభుత్వ వైద్య కళాశాలల్లో వంద శాతం ప్రవేశాలు పూర్తి
- పిడుగురాళ్ల కళాశాలలో తొలిసారిగా ఎంబీబీఎస్ అడ్మిషన్లు



అమరావతి, నవంబర్ 18 (సమయం న్యూస్) : రాష్ట్రంలో 2026ఉ27 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం ప్రవేశాల ప్రక్రియ నవంబర్ 16తో ముగిసింది. రాష్ట్రంలోని మొత్తం 7,465 సీట్లలో 528 సీట్లు అఖిల భారత కోటాకు పోగా, మిగిలిన 6,937 రాష్ట్ర కోటా సీట్లలో 6,929 సీట్లు (99.88 శాతం) భర్తీ అయ్యాయి. కేవలం 8 సీట్లు మాత్రమే ఖాళీగా మిగిలాయి. ప్రవేశాలు పొందిన వారిలో 4,250 మంది విద్యార్థినులు (61.34 శాతం), 2,679 మంది విద్యార్థులు (38.66 శాతం) ఉన్నారు. కన్వీనర్, యాజమాన్య కోటాలు రెండింటిలోనూ అమ్మాయిలే పైచేయి సాధించడం వైద్య విద్యలో మహిళల పెరుగుతున్న భాగస్వామ్యానికి నిదర్శనంగా నిలిచింది. ఈ వివరాలతో కూడిన నివేదికను ఎన్టీఆర్ ఆరోగ్య, విజ్ఞాన విశ్వవిద్యాలయం రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు అందజేసింది.

ప్రభుత్వ కళాశాలల్లో వంద శాతం

కన్వీనర్ కోటాలోని మొత్తం 4,581 సీట్లూ (ప్రభుత్వ కళాశాలల్లో 2,631, ప్రైవేటులో 1,950) వంద శాతం భర్తీ అయ్యాయి. ఇందులో 2,858 మంది విద్యార్థినులు (62.39 శాతం), 1,723 మంది విద్యార్థులు (37.61 శాతం) సీట్లు దక్కించుకున్నారు. యాజమాన్య కోటాలోని 2,356 సీట్లలో 2,348 సీట్లు నిండగా, వీటిలోనూ 1,392 మంది అమ్మాయిలు (59.28 శాతం), 956 మంది అబ్బాయిలు (40.72 శాతం) ఉన్నారు. పాడేరు ప్రభుత్వ వైద్య కళాశాలలో 9, విజయనగరంలో 3 చొప్పున మిగిలిపోయిన 12 సీట్ల ఫీజును రూ.20 లక్షల నుంచి రూ.12 లక్షలకు తగ్గించి సెల్ఫ్ ఫైనాన్సింగ్ కేటగిరీలోకి మార్చడంతో అవి కూడా భర్తీ అయ్యాయి. ఫలితంగా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో వంద శాతం ప్రవేశాలు పూర్తయ్యాయి.

స్ట్రే రౌండ్‌తో 61 సీట్ల భర్తీ..

గత వారం దేశవ్యాప్తంగా 411 సీట్లు ఖాళీగా ఉన్నాయని జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) ప్రకటించిన సమయంలో రాష్ట్రంలోని ఎన్ఆర్ఐ (కేటగిరీ-సి) కోటాలో 69 సీట్లు మిగిలాయి. ఎన్ఎంసీ అనుమతితో ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రెండుసార్లు ప్రత్యేక స్ట్రే రౌండ్ కౌన్సెలింగ్ నిర్వహించగా 61 సీట్లు భర్తీ అయ్యాయి. చివరకు ఎన్ఆర్ఐ కేటగిరీలో తిరుపతిలోని టీటీడీ శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాలలో 7, ఓ ప్రైవేటు కళాశాలలో ఒక సీటు మాత్రమే ఖాళీగా ఉన్నాయి. మరోవైపు పిడుగురాళ్ల ప్రభుత్వ వైద్య కళాశాలలో తొలిసారిగా ఎంబీబీఎస్ ప్రవేశాలు జరిగాయి. ఇక్కడి 50 సీట్లలో 7 అఖిల భారత కోటా, 22 కన్వీనర్, 21 యాజమాన్య కోటాకు కేటాయించగా.. కన్వీనర్ కోటా సీట్లన్నీ మూడో విడతలోనే భర్తీ అయ్యాయి. సాధారణ కేటగిరీలో 61,593వ ర్యాంకు (524 మార్కులు) నుంచి 1,70,433వ ర్యాంకు (448 మార్కులు) వరకు విద్యార్థులకు సీట్లు దక్కాయి.



స్థానిక తీర్పుతో మా బాధ్యత పెరిగింది

23 మున్సిపాలిటీలు, పంచాయతీల్లోనూ కూటమిని ఆశీర్వదించాలి

యువ నాయకత్వానికి ప్రాధాన్యమిచ్చామన్న నాదెండ్ల మనోహర్

గత పాలనపై అసంతృప్తే ఫలితాల్లో కనిపించిందని ఆరోపణ

మంగళగిరిలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతల ఉమ్మడి సమావేశం

మంగళగిరి, నవంబర్ 18 (సమయం న్యూస్): ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల తీర్పు కూటమి ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని మరోసారి చాటిందని, అదే సమయంలో తమపై బాధ్యతను మరింత పెంచిందని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి, జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. రాబోయే 23 మున్సిపాలిటీలు, పంచాయతీ ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థులను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. బుధవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024 సాధారణ ఎన్నికల తరహాలోనే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ప్రజా సంక్షేమం, గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధిని గుర్తించి ప్రజలు కూటమి అభ్యర్థులను గెలిపించారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్తు, యువత ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి పార్టీలు ఐక్యంగా పనిచేస్తున్నాయని మనోహర్ తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలు, సవాళ్లపై చర్చించుకుని ప్రజల ఆకాంక్షల మేరకు ముందుకు సాగుతున్నామని చెప్పారు. కూటమి పార్టీలు కలిసి కొనసాగితేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ప్రజలు విశ్వసిస్తున్నారని పేర్కొన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని, అప్పటి ప్రభుత్వ విధానాలు, అవినీతి పాలనపై ప్రజల్లో ఉన్న అసంతృప్తి 2024 ఎన్నికలతో పాటు తాజా స్థానిక సంస్థల ఫలితాల్లోనూ ప్రతిఫలించిందని ఆయన ఆరోపించారు.

యువ నాయకత్వానికి ప్రాధాన్యం

జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఎన్డీఏ కూటమి అభ్యర్థులు ఎక్కడ పోటీ చేసినా వారి విజయానికి జనసేన నాయకులు, కార్యకర్తలు కూటమి స్ఫూర్తితో, సమన్వయంతో కృషి చేస్తున్నారని మనోహర్ తెలిపారు. ఈ ఎన్నికల్లో కొత్త ఆలోచనలతో ముందుకొచ్చే యువ నాయకత్వానికి కూటమి పార్టీలు ప్రాధాన్యమిచ్చి అవకాశాలు కల్పించాయని, యువ నేతలను ప్రజలు ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠ ద్వార దర్శనాల్లో సామాన్యులకే పెద్దపీట

డిసెంబర్ 20 నుంచి 29 వరకు 8.34 లక్షల మందికి దర్శనం

రూ.2,750 కోట్లతో అలిపిరి వద్ద యాత్రికుల టౌన్‌షిప్

ఉద్యోగులకు బ్రహ్మోత్సవ కానుక, 500 దేశీయ గోవుల కొనుగోలు

టీటీడీ సాధికారిక మండలి సమావేశంలో పలు కీలక నిర్ణయాలు



తిరుమల, నవంబర్ 18 (సమయం న్యూస్) : తిరుమల శ్రీవారి ఆలయంలో డిసెంబర్ 20 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించే వైకుంఠ ద్వార దర్శనాల్లో 8.34 లక్షల మంది భక్తులకు అవకాశం కల్పించేలా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ సాధికారిక మండలి చైర్మన్ ముద్దాడ రవిచంద్ర తెలిపారు. ఇందులో సామాన్య భక్తులకు 92 శాతం ప్రాధాన్యమిస్తామని వెల్లడించారు. బుధవారం తిరుమల అన్నమయ్య భవనంలో జరిగిన టీటీడీ సాధికారిక మండలి సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అలిపిరి సమీపంలో శ్రీవాణి ట్రస్ట్ నిధులు రూ.2,750 కోట్లతో యాత్రికుల టౌన్‌షిప్ నిర్మాణానికి డీపీఆర్, డిజైన్ల తయారీ కోసం కన్సల్టెన్సీ సంస్థను ఎంపిక చేయాలని నిర్ణయించారు. తిరుమల పారిశుద్ధ్య నిర్వహణకు 348 మంది అదనపు సిబ్బంది నియామకానికి, శ్రీవారి నిత్య కైంకర్యాలకు పాలు, నెయ్యి సమకూర్చుకునేందుకు రూ.7.50 కోట్లతో 500 దేశీయ గోవుల కొనుగోలుకు మండలి ఆమోదం తెలిపింది.

ఉద్యోగులకు బ్రహ్మోత్సవ కానుక.. స్విమ్స్‌కు ప్రత్యేక గ్రాంటు

టీటీడీ పర్మినెంట్ ఉద్యోగులకు రూ.16,940, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి రూ.8,289 చొప్పున బ్రహ్మోత్సవ కానుక అందించేందుకు మండలి ఆమోదముద్ర వేసింది. ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే సమగ్ర సంక్షేమ విధానం అమలుకు పచ్చజెండా ఊపింది. స్విమ్స్ ఆసుపత్రికి అదనంగా రూ.41.23 కోట్ల ప్రత్యేక గ్రాంటు, ఎస్వీ ఆయుర్వేద కళాశాలలో మరో 20 బీఏఎంఎస్ సీట్ల పెంపునకు ఆమోదం తెలిపింది. శిల్పకళాశాలలో రూ.23 కోట్లతో 229 మంది విద్యార్థులకు సరిపడే హాస్టల్ నిర్మించనున్నారు. అటవీ, వన్యప్రాణుల సంరక్షణకు రూ.16.40 కోట్లు, శ్రీనివాస మంగాపురం నుంచి శ్రీవారిమెట్టు వరకు రహదారి అభివృద్ధికి రూ.9.50 కోట్లు కేటాయిస్తూ పలు అభివృద్ధి, సంక్షేమ ప్రతిపాదనలకు సాధికారిక మండలి ఆమోదం తెలిపింది.

సంపాదకీయం



నెమ్మదిగా కదిలే తుఫానులు

పెనువిపత్తుకు సంకేతాలా?

వేగం తక్కువైనా విధ్వంసం ఎక్కువయ్యే ప్రమాదం

ప్రకృతి విపత్తుల తీవ్రతను అంచనా వేయడంలో మనం ఇప్పటికీ కొన్ని అపోహల మధ్యనే ఉన్నాం. తుఫాను ఎంత వేగంగా కదులుతోంది? గాలులు ఎంత బలంగా వీస్తున్నాయి? అనే అంశాల ఆధారంగానే దాని ప్రమాదాన్ని అంచనా వేస్తుంటాం. కానీ నెమ్మదిగా కదిలే తుఫానులు కూడా అత్యంత ప్రమాదకరంగా మారవచ్చని వాతావరణ పరిశోధనలు హెచ్చరిస్తున్నాయి. బంగాళాఖాతంలో తుఫానుల ముప్పు నేపథ్యంలో ఈ అంశం మరోసారి ప్రాధాన్యం సంతరించుకుంది. తుఫాను కదలిక మందగించడం ఒక్కటే దాని విధ్వంసక శక్తిని నిర్ణయించకపోయినా, ఒకే ప్రాంతంలో ఎక్కువసేపు ప్రభావం చూపడం వల్ల భారీ వర్షాలు, వరదలు సంభవించే ప్రమాదం పెరుగుతుంది. అందుకే తుఫాను వేగం కంటే దాని ప్రభావం ఎంతసేపు కొనసాగుతుందనే అంశాన్ని కూడా ప్రభుత్వాలు, ప్రజలు తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉంది. సాధారణంగా తుఫాను వేగంగా ముందుకు కదిలితే ప్రభావిత ప్రాంతాన్ని తక్కువ సమయంలో దాటిపోతుంది. కానీ నెమ్మదిగా కదిలే తుఫాను ఒకే ప్రాంతంపై గంటల తరబడి, కొన్నిసార్లు రోజులపాటు ప్రభావం చూపుతుంది. ఫలితంగా ఎడతెరిపి లేకుండా కురిసే వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతాయి. నదుల్లో నీటిమట్టాలు పెరిగి లోతట్టు ప్రాంతాలు జలమయమవుతాయి. వ్యవసాయ భూములు నీటమునిగి పంటలు దెబ్బతింటాయి. రహదారులు, విద్యుత్ వ్యవస్థలు, సమాచార సంబంధాలు స్తంభించే ప్రమాదం ఉంటుంది. ముఖ్యంగా తీరప్రాంతాల్లో సముద్రపు అలల ఉద్ధృతి, భారీ వర్షాలు ఒకేసారి సంభవిస్తే పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారుతుంది. తుఫానుల కదలికలు, వర్షపాతం మధ్య సంబంధంపై శాస్త్రవేత్తలు నిర్వహించిన పరిశోధనలు ఆసక్తికరమైన విషయాలను వెల్లడించాయి. 2021లో 'జర్నల్ ఆఫ్ హైడ్రోమెటియరాలజీ'లో ప్రచురితమైన అధ్యయనంలో 2010 నుంచి 2019 మధ్య తీరాన్ని దాటిన 280 ఉష్ణమండల తుఫానులను పరిశీలించారు. తుఫానుల కదలిక వేగం, వరదల తీవ్రత మధ్య సంబంధం ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. నెమ్మదిగా కదిలే తుఫానులు ఒకే ప్రాంతంలో ఎక్కువసేపు వర్షాలు కురిపించడం వల్ల మొత్తం వర్షపాతం పెరిగి వరదల ప్రమాదం అధికమవుతుందని అధ్యయనం సూచించింది. అయితే వేగంగా కదిలే తుఫానుల్లో వర్షపాతం తక్కువగా ఉంటుందని భావించడం కూడా సరికాదు. 2022లో 'నేచర్ కమ్యూనికేషన్స్'లో ప్రచురితమైన మరో పరిశోధనలో 2001 నుంచి 2020 మధ్య ఉపగ్రహాల ద్వారా సేకరించిన వర్షపాత సమాచారాన్ని విశ్లేషించారు. వేగంగా కదిలే ఉష్ణమండల తుఫానుల్లో సగటు వర్షపాతం రేటు నెమ్మదిగా కదిలే తుఫానులతో పోలిస్తే 24 శాతం ఎక్కువగా ఉన్నట్లు ఆ అధ్యయనం గుర్తించింది. దీన్నిబట్టి తుఫాను కదలిక వేగం, వర్షం కురిసే తీవ్రత, మొత్తం వర్షపాతం మూడు వేర్వేరు అంశాలని అర్థమవుతోంది. తక్కువ సమయంలో అత్యంత భారీ వర్షం కురవడం ఒక రకమైన ప్రమాదమైతే, ఎక్కువసేపు వర్షాలు కొనసాగడం మరో రకమైన ప్రమాదం. రెండింటినీ సమానంగా పరిగణించాల్సిందే. ఆంధ్రప్రదేశ్ వంటి సుదీర్ఘ తీరప్రాంతం కలిగిన రాష్ట్రాలకు తుఫానులు కొత్తేమీ కాదు. బంగాళాఖాతంలో ఏర్పడే అల్పపీడనాలు, వాయుగుండాలు, తుఫానుల ప్రభావం తరచూ కనిపిస్తూనే ఉంటుంది. ముఖ్యంగా కోస్తాంధ్ర జిల్లాల్లో వ్యవసాయం, మత్స్యకార వృత్తి, తీరప్రాంత ఆర్థిక కార్యకలాపాలు వాతావరణ పరిస్థితులపై ఎక్కువగా ఆధారపడి ఉంటాయి. తుఫాను హెచ్చరిక వెలువడినప్పుడల్లా మత్స్యకారుల జీవనోపాధి నిలిచిపోవడం, చేతికొచ్చిన పంటలు దెబ్బతినడం, రవాణా వ్యవస్థలకు అంతరాయం ఏర్పడటం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రకృతి విపత్తు ముగిసిన తర్వాత కూడా బాధిత కుటుంబాలు సాధారణ స్థితికి చేరుకోవడానికి నెలల తరబడి సమయం పడుతోంది. మరోవైపు వాతావరణ మార్పులు తుఫానుల స్వభావంపై చూపుతున్న ప్రభావాన్ని విస్మరించలేం. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల తుఫానులకు అవసరమైన శక్తి లభించే అవకాశాలు పెరుగుతాయని శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు. ఎల్‌నినో వంటి ప్రపంచ వాతావరణ పరిణామాలు కూడా తుఫానుల ఏర్పాటుకు అనుకూలమైన పరిస్థితులను ప్రభావితం చేయగలవు. అయితే ఒక నిర్దిష్ట తుఫానుకు ఎల్‌నినోనే కారణమని చెప్పాలంటే ప్రత్యేకమైన శాస్త్రీయ విశ్లేషణ అవసరం. ప్రతి తుఫానును వాతావరణ మార్పులకు నేరుగా ఆపాదించడం కంటే దీర్ఘకాలిక పరిశోధనల ఆధారంగా ప్రమాదాలను అంచనా వేయడం ముఖ్యం. ఇక్కడ ప్రభుత్వాల ముందున్న ప్రధాన సవాలు తుఫాను వచ్చిన తర్వాత సహాయక చర్యలు చేపట్టడం మాత్రమే కాదు. తుఫాను రాకముందే ప్రాణ, ఆస్తి నష్టాలను సాధ్యమైనంత వరకు నివారించడం. వాతావరణ శాఖ హెచ్చరికలను గ్రామస్థాయికి చేరవేయడం, లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించడం, తుఫాను ఆశ్రయ కేంద్రాలను సిద్ధంగా ఉంచడం అత్యవసరం. చెరువులు, కాలువలు, మురుగునీటి పారుదల వ్యవస్థలను సక్రమంగా నిర్వహించడం కూడా వరద నష్టాలను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. తీరప్రాంతాల్లో మడ అడవుల పరిరక్షణ, పటిష్ఠమైన మౌలిక సదుపాయాల నిర్మాణం, శాస్త్రీయ ప్రణాళికల అమలు దీర్ఘకాలిక రక్షణకు అవసరం. ప్రకృతి విపత్తులను పూర్తిగా అడ్డుకోవడం మనిషి చేతుల్లో లేకపోవచ్చు. కానీ వాటి వల్ల సంభవించే నష్టాలను తగ్గించడం మాత్రం సాధ్యమే. సాంకేతిక పరిజ్ఞానం ఎంత అభివృద్ధి చెందినా అధికార యంత్రాంగం అప్రమత్తంగా లేకపోతే ముందస్తు హెచ్చరికల ప్రయోజనం ప్రజలకు అందదు. తుఫాను కదలికలపై నిరంతర నిఘా, శాస్త్రీయ అంచనాల ఆధారంగా నిర్ణయాలు, ప్రజల్లో అవగాహన, ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయం అత్యంత అవసరం.



ప్రపంచ నేతలకు మోదీ అపురూప కానుకలు


- ఫిలిప్పీన్స్ పర్యటనలో భారతీయ కళావైభవానికి పెద్దపీట
- ట్రంప్‌కు రాజస్థాన్ పిచ్వాయ్ చిత్రకళాఖండం
- ఫిలిప్పీన్స్ అధ్యక్షుడికి కశ్మీరీ పట్టు తివాచీ
- జపాన్ ప్రధానికి బనారసీ పట్టు శాలువా
- భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను చాటిన బహుమతులు

మనీలా, నవంబర్ 18 (సమయం న్యూస్): భారతీయ కళలు, సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని ప్రపంచానికి చాటేలా ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ నేతలకు అపురూప బహుమతులు అందజేశారు. రెండు ప్రాంతీయ శిఖరాగ్ర సదస్సుల్లో పాల్గొనేందుకు ఫిలిప్పీన్స్ రాజధాని మనీలా చేరుకున్న సందర్భంగా పలువురు దేశాధినేతలకు భారతీయ హస్తకళా నైపుణ్యాన్ని ప్రతిబింబించే కళాఖండాలను కానుకలుగా ఇచ్చారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన సంప్రదాయ చిత్రకళ, శిల్పకళ, వస్త్ర కళాఖండాలను ఎంపిక చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు రాజస్థాన్‌లో ప్రసిద్ధి చెందిన గోల్డెన్ పిచ్వాయ్ చిత్రకళాఖండాన్ని మోదీ బహూకరించారు. సంప్రదాయ వస్త్ర చిత్రకళకు ప్రతీకగా నిలిచే ఈ కళాఖండంలో బంగారు వర్ణాల అలంకరణ ప్రత్యేక ఆకర్షణ. ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ జూనియర్‌కు కశ్మీరీ పట్టు తివాచీని అందజేశారు. చేతితో నేసే ఈ తివాచీలు సున్నితమైన అల్లికలు, ఆకర్షణీయమైన నమూనాలకు ప్రసిద్ధి చెందాయి. ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోకు చోళుల కాలం నాటి శిల్ప సంప్రదాయాన్ని ప్రతిబింబించే కాంస్య కళాఖండాన్ని బహూకరించారు. తొమ్మిదో శతాబ్దం నుంచి పదమూడో శతాబ్దం వరకు దక్షిణ భారతదేశంలో విలసిల్లిన చోళ శిల్పకళకు ఈ బహుమతి ప్రతీకగా నిలిచింది. కంబోడియా ప్రధాని హున్ మానెట్‌కు సంప్రదాయ ధోక్రా కళాత్మక పడవను అందజేశారు. మయన్మార్ అధ్యక్షుడు మిన్ ఆంగ్ హ్లైంగ్‌కు జింక్, రాగి మిశ్రమంతో రూపొందించే బిద్రీవేర్ లోహ కళాఖండాన్ని కానుకగా ఇచ్చారు. జపాన్ ప్రధాని సనాయే తకైచికి ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి ప్రసిద్ధ బనారసీ పట్టు శాలువాను అందజేశారు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌కు రాజస్థాన్‌లోని జైపూర్ నీలిరంగు మట్టిపాత్ర కళాఖండాన్ని బహూకరించారు. ఈ బహుమతుల ద్వారా రాజస్థాన్, కశ్మీర్, తమిళనాడు, కర్ణాటక, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల సంప్రదాయ కళలకు అంతర్జాతీయ వేదికపై గుర్తింపు లభించింది. దౌత్య సంబంధాలతోపాటు భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేసే ప్రయత్నంగా మోదీ అందించిన కానుకలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి.

కుల్గాంలో భారీ ఎన్‌కౌంటర్..
లష్కరే ఉగ్రవాది హతం!

భద్రతా బలగాల కాల్పుల్లో లతీఫ్ భట్ మృతి

మసీదులో దాక్కున్న ఉగ్రవాదిని గుర్తించిన బలగాలు



శ్రీనగర్, నవంబర్ 18 (సమయం న్యూస్): జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల ఏరివేత చర్యల్లో భాగంగా భద్రతా బలగాలు మరో ఉగ్రవాదిని మట్టుబెట్టాయి. కుల్గాం జిల్లాలో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో లష్కరే తోయిబాకు చెందిన లతీఫ్ భట్ హతమయ్యాడు. ఓ మసీదులో దాక్కున్న అతడిని గుర్తించిన భద్రతా దళాలు ముందుగా లొంగిపోవాలని సూచించాయి. అయితే అందుకు నిరాకరించిన లతీఫ్ కాల్పులకు దిగడంతో బలగాలు ఎదురుకాల్పులు జరిపాయి. ఈ ఘటనలో అతడు మృతి చెందినట్లు భద్రతా వర్గాలు వెల్లడించాయి. నవంబర్ 11న కుల్గాం జిల్లా అఖ్రాన్‌లోని సీఆర్పీఎఫ్ చెక్‌పోస్టుపై జరిగిన దాడిలో లతీఫ్ భట్‌కు కీలక పాత్ర ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఆ దాడిలో ముగ్గురు సీఆర్పీఎఫ్ సిబ్బంది గాయపడ్డారు. ఘటన అనంతరం ఉగ్రవాదుల కోసం భద్రతా దళాలు విస్తృతంగా గాలింపు చేపట్టాయి. ఈ క్రమంలో సోమవారం ఉమర్ నిసార్ అనే ఉగ్రవాది ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. తాజాగా లతీఫ్ భట్ ఆచూకీ లభించడంతో కుల్గాంలో ప్రత్యేక గాలింపు చర్యలు నిర్వహించారు. మసీదులో దాక్కున్న లతీఫ్‌తో పోలీసులు, ఉన్నతాధికారులు వీడియో కాల్ ద్వారా మాట్లాడి లొంగిపోవాలని కోరినట్లు సమాచారం. 'నీకు ఇంకా జీవితం ఉంది.. నువ్వు చాలా చిన్నవాడివి' అంటూ నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. అయితే లొంగిపోయేందుకు నిరాకరించిన అతడు 'నేను అల్లాహ్‌ను కలవాలనుకుంటున్నాను' అని సమాధానమిచ్చినట్లు భద్రతా వర్గాలు తెలిపాయి. తెల్లవారుజామున 2.45 గంటల సమయంలో బలగాలపై కాల్పులు జరపడంతో ఎదురుకాల్పులు జరిగాయని వెల్లడించాయి. లతీఫ్ భట్ హతమైన అనంతరం కూడా ఆ ప్రాంతంలో భద్రతా దళాల గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌పై జమ్మూకశ్మీర్ పోలీసులు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించారు. 'మీరు పారిపోవచ్చు.. కానీ తప్పించుకోలేరు' అంటూ పోస్టు చేశారు. ఉగ్రవాద కార్యకలాపాలను అడ్డుకునేందుకు భద్రతా బలగాలు అప్రమత్తంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

బర్డ్‌ఫ్లూ నియంత్రణకు
తొలి స్వదేశీ టీకా

నేడు దేశానికి అంకితం



భోపాల్, నవంబర్ 18 (సమయం న్యూస్): దేశంలోని పౌల్ట్రీ పరిశ్రమను తీవ్రంగా ప్రభావితం చేస్తున్న బర్డ్‌ఫ్లూ నియంత్రణ దిశగా భారత్ కీలక ముందడుగు వేసింది. హెచ్5ఎన్1 ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజా వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు తొలి స్వదేశీ టీకాను అభివృద్ధి చేసినట్లు వెల్లడైంది. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లోని ఐసీఏఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హై సెక్యూరిటీ యానిమల్ డిసీజెస్ శాస్త్రవేత్తలు ఈ టీకాను రూపొందించారు. నవంబర్ 20న కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ భోపాల్‌లో జరిగే కార్యక్రమంలో దీనిని జాతికి అంకితం చేయనున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో తరచూ బర్డ్‌ఫ్లూ వ్యాప్తి చెందడంతో పెద్ద సంఖ్యలో కోళ్లు, ఇతర పక్షులు మృత్యువాత పడుతున్నాయి. దీంతో పౌల్ట్రీ రైతులు తీవ్ర ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యకు పరిష్కారం కనుగొనే లక్ష్యంతో భోపాల్‌లోని పరిశోధనా సంస్థ శాస్త్రవేత్తలు కొంతకాలంగా ప్రయోగాలు నిర్వహించి స్వదేశీ టీకాను అభివృద్ధి చేశారు. ఈ టీకా అందుబాటులోకి వస్తే బర్డ్‌ఫ్లూ నియంత్రణ చర్యలకు మరింత బలం చేకూరే అవకాశముందని భావిస్తున్నారు. అయితే టీకా వాణిజ్య ఉత్పత్తి, మార్కెట్‌లో విడుదల, రైతులకు అందుబాటులోకి వచ్చే తేదీలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. టీకా వినియోగానికి సంబంధించిన మార్గదర్శకాలు వెల్లడైన తర్వాతే పౌల్ట్రీ పరిశ్రమకు కలిగే ప్రయోజనాలపై పూర్తి స్పష్టత రానుంది.

నావికాదళానికి మరింత రక్షణ కవచం!

బరాక్ క్షిపణుల ఆధునికీకరణకు భారత్ కీలక ఒప్పందం

ఇజ్రాయెల్ సంస్థతో రూ.1,976 కోట్ల భారీ ఒప్పందం

న్యూఢిల్లీ, నవంబర్ 18 (సమయం న్యూస్): భారత నావికాదళ రక్షణ సామర్థ్యాన్ని మరింత పటిష్ఠం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. యుద్ధనౌకలపై అమర్చిన బరాక్ పాయింట్ డిఫెన్స్ క్షిపణి వ్యవస్థలను ఆధునికీకరించేందుకు ఇజ్రాయెల్ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ (ఐఏఐ) సంస్థతో రూ.1,976.40 కోట్ల విలువైన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. బుధవారం న్యూఢిల్లీలో రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ సమక్షంలో ఇరుపక్షాల అధికారులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందంలో భాగంగా భారత నావికాదళ యుద్ధనౌకల్లోని బరాక్ క్షిపణి వ్యవస్థల హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌లను సమగ్రంగా ఆధునికీకరించనున్నారు. కాలం చెల్లిన సాంకేతిక పరికరాల స్థానంలో అధునాతన విడిభాగాలను అమర్చడంతోపాటు వ్యవస్థల పనితీరును మెరుగుపరచనున్నారు. తద్వారా శత్రు దేశాల క్షిపణులు, యుద్ధ విమానాలు, ఇతర గగనతల ముప్పులను ఎదుర్కొనే సామర్థ్యం మరింత పెరుగుతుందని రక్షణ వర్గాలు భావిస్తున్నాయి. సముద్ర జలాల్లో విధులు నిర్వహించే యుద్ధనౌకలకు బరాక్ క్షిపణి వ్యవస్థ కీలక రక్షణ కవచంగా పనిచేస్తోంది. ఆకస్మిక గగనతల దాడులను గుర్తించి అడ్డుకోవడంలో ఈ వ్యవస్థ ప్రధాన పాత్ర పోషిస్తుంది. తాజా ఆధునికీకరణతో క్షిపణి రక్షణ వ్యవస్థల విశ్వసనీయత, నిర్వహణ సామర్థ్యం పెరగనున్నాయి. సముద్ర భద్రతకు ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో భారత్–ఇజ్రాయెల్ రక్షణ సహకారంలో ఈ ఒప్పందం మరో కీలక ముందడుగుగా నిలవనుంది.





జంతుబలుల నిషేధానికి సుప్రీంకోర్టు నో!

మతపరమైన వేడుకల్లో జంతువధను నిషేధించాలంటూ పిటిషన్

పిటిషనర్ వాదనలు విన్న అనంతరం వ్యాజ్యం కొట్టివేత

న్యూఢిల్లీ, నవంబర్ 18 (సమయం న్యూస్): మతపరమైన వేడుకలు, ఆలయాల్లో జంతుబలులను నిషేధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు బుధవారం కొట్టివేసింది. న్యాయవాది శృతి బిష్త్ దాఖలు చేసిన ఈ వ్యాజ్యాన్ని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ ఆర్. మహాదేవన్, జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. పిటిషనర్ వాదనలు విన్న అనంతరం వ్యాజ్యాన్ని కొట్టివేస్తూ నిర్ణయం తీసుకుంది. దేశంలోని పలు ప్రాంతాల్లో మతం పేరుతో జంతుబలులు కొనసాగుతున్నాయని పిటిషనర్ న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. జంతు హింస నిరోధక చట్టం--1960లో మతపరమైన ఆచారాలకు కల్పించిన మినహాయింపులను సవరించాలని కోరారు. మతపరమైన కార్యక్రమాల పేరిట జంతువులను చంపడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కింద జీవించే హక్కుకు విరుద్ధమని వాదించారు. జంతుబలులను నిషేధించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అయితే ఈ అభ్యర్థనను సుప్రీంకోర్టు ధర్మాసనం తిరస్కరించింది. పిటిషన్ కొట్టివేతకు సంబంధించిన పూర్తి కారణాలు ఉత్తర్వుల్లో వెల్లడికావాల్సి ఉంది.



ఇఫీలో.. 'భక్త కన్నప్ప'కు స్వర్ణోత్సవ గౌరవం!

57వ చలనచిత్రోత్సవంలో తమిళ, తెలుగు చిత్రాలకు ప్రత్యేక స్థానం

విభిన్న సామాజిక అంశాలను ఆవిష్కరిస్తున్న దక్షిణాది సినిమాలు

బాపు దర్శకత్వంలో 1976లో విడుదలైన భక్త కన్నప్ప చిత్రానికి పునరుద్ధరణ

ఇఫీ-2026లో మానవ భావోద్వేగాలను ప్రతిబింబించే కథలకు ప్రాధాన్యం

పనాజీ (గోవా), నవంబర్ 18 (సమయం న్యూస్): గోవాలో జరుగుతున్న 57వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో (ఇఫీ) తమిళ, తెలుగు చిత్రాలు విభిన్న కథాంశాలతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. కుటుంబ బంధాలు, ప్రేమ, విద్య, పర్యావరణ పరిరక్షణ, వ్యక్తిగత ఆశయాలు, రాజకీయాలు, మానవీయ విలువలను ఈ చిత్రాలు అద్భుతంగా ప్రతిబింబిస్తున్నాయి. తమిళంలో 'స్క్రోల్', 'తాయ్ కిళవి', 'అరివు', 'అట్టపాడి', 'గూడు' చిత్రాలు విభిన్న సామాజిక అంశాలను ఆవిష్కరిస్తున్నాయి. తెలుగు విభాగంలో 'సింగ్ గీతం', 'మన శంకర వరప్రసాద్ గారు', 'చెన్నై లవ్ స్టోరీ', 'వై, వాణి?', 'విన్', 'మాయసభ' చిత్రాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకోనున్నాయి. ముఖ్యంగా 'భక్త కన్నప్ప'కు స్వర్ణోత్సవ గౌరవం లభించింది. ప్రముఖ దర్శకుడు బాపు దర్శకత్వంలో 1976లో విడుదలైన ఈ ప్రతిష్టాత్మక చిత్రం 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా.. పునరుద్ధరించిన రూపంలో ప్రత్యేకంగా ప్రదర్శించనున్నారు. 'ఎల్లలు లేని కథా ప్రపంచం' అనే ఇతివృత్తంతో నిర్వహిస్తున్న ఇఫీ 2026లో భాషా, సాంస్కృతిక సరిహద్దులను దాటి మానవ భావోద్వేగాలను ప్రతిబింబించే భారతీయ కథలకు పెద్దపీట వేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఎగుమతులకు ఊతం.. మార్గదర్శకాల సవరణ!

కేంద్ర వాణిజ్య శాఖ నిర్ణయాన్ని స్వాగతించిన ఫియో

ఎంఎస్ఎంఈలు, తొలిసారి ఎగుమతిదారులకు మరింత ప్రయోజనం

అర్హత ఎగుమతి టర్నోవర్ పరిమితి రూ.50 కోట్లకు పెంపు

నాణ్యత ధ్రువపత్రాల కోటా 462 నుంచి 600కు పెంచుతూ నిర్ణయం

రవాణా సహాయ పరిధిని 34 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు విస్తరణ



న్యూఢిల్లీ, నవంబర్ 18 (సమయం న్యూస్): ఎగుమతుల ప్రోత్సాహక మిషన్‌లోని కీలక పథకాల మార్గదర్శకాల్లో కేంద్ర వాణిజ్య శాఖ చేసిన సవరణలను భారత ఎగుమతి సంస్థల సమాఖ్య (ఫియో) స్వాగతించింది. ఈ మార్పులు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు), తొలిసారి ఎగుమతిదారులు, తక్కువ ఎగుమతులు ఉన్న ప్రాంతాల్లోని వ్యాపారాలకు మరింత ప్రయోజనం చేకూర్చనున్నాయని ఫియో అధ్యక్షుడు ఎస్.సి.రల్హాన్ తెలిపారు. అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శనలు, కొనుగోలుదారులుఉవిక్రేతల సమావేశాలు, వాణిజ్య ప్రతినిధి బృందాల్లో పాల్గొనేందుకు విమాన ప్రయాణ ఖర్చులపై 95 శాతం వరకు సహాయం అందించడం, అర్హత ఎగుమతి టర్నోవర్ పరిమితిని రూ.75 లక్షల నుంచి రూ.50 కోట్లకు పెంచడం లాంటి చర్యలను ఫియో ప్రశంసించింది.

ప్రపంచ మార్కెట్లతో అనుసంధానం..

నాణ్యత, ప్రమాణాల ధ్రువపత్రాల కోసం అర్హమైన సర్టిఫికెట్ల సంఖ్యను 462 నుంచి 600కు పెంచడం వల్ల ఎంఎస్ఎంఈలకు అంతర్జాతీయ ప్రమాణాలను చేరుకోవడం సులభతరం అవుతుందని ఫియో పేర్కొంది. రవాణా, సరకు రవాణా సహాయ పరిధిని 13 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 34కు పెంచడం, భూకస్టమ్స్ కేంద్రాలు, సమగ్ర తనిఖీ కేంద్రాలు, జలమార్గాలను చేర్చడం వల్ల తక్కువ ఎగుమతి సామర్థ్యం ఉన్న ప్రాంతాల వారికి ప్రయోజనం కలుగుతుందని తెలిపింది. ఈ మార్పులు ఎగుమతి వ్యయాన్ని తగ్గించి, భారతీయ ఎంఎస్ఎంఈలను ప్రపంచ మార్కెట్లతో అనుసంధానించడంలో కీలకంగా పనిచేస్తాయని, దేశ ఎగుమతుల వృద్ధికి ఇవి మరింత ఊతమిస్తాయని ఫియో అభిప్రాయపడింది.

నౌకాదళానికి 9 కొత్త జలాంతర్గాములు!

రూ.1.11 లక్షల కోట్ల వ్యయంతో నిర్మాణానికి సన్నాహాలు

- **దేశీయంగా ఆరు అత్యాధునిక జలాంతర్గాముల తయారీ**
- **మజగావ్ డాక్‌లోనే మరో మూడు స్కార్పీన్ తరగతి సబ్‌మెరైన్లు**
- **హిందూ మహాసముద్రంలో బలోపేతం కానున్న నౌకాదళం**
- **కొచ్చిలో కొత్తగా సీటెక్ సోనార్ టెస్టింగ్ కేంద్రం ఏర్పాటు**



న్యూఢిల్లీ, నవంబర్ 18 (సమయం న్యూస్): భారత నౌకాదళాన్ని మరింత ఆధునీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మొత్తం రూ.1.11 లక్షల కోట్ల వ్యయంతో తొమ్మిది కొత్త జలాంతర్గాముల నిర్మాణానికి ప్రతిపాదనల ప్రక్రియ తాజాగా పూర్తయింది. ఇందులో రూ.75 వేల కోట్లతో ప్రాజెక్టు-75 (ఐ) కింద ఆరు ఆధునిక జలాంతర్గాములను దేశీయంగా నిర్మించనున్నారు. జర్మనీకి చెందిన టీకేఎంఎస్ సంస్థతో కలిసి మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ ఈ నిర్మాణాన్ని చేపట్టనుంది. వీటికి అదనంగా రూ.36 వేల కోట్లతో మరో మూడు స్కార్పీన్ తరగతి జలాంతర్గాములను కూడా మజగావ్ డాక్‌లోనే నిర్మించనున్నారు.

బలోపేతం కానున్న నౌకాదళం..

ఈ కొత్త జలాంతర్గాముల చేరికతో హిందూ మహాసముద్ర ప్రాంతంలో భారత నౌకాదళ సామర్థ్యం గణనీయంగా పెరగనుందని అధికారులు తెలిపారు. చైనా, పాకిస్తాన్ నుంచి ఎదురయ్యే సముద్ర భద్రతా సవాళ్లను అత్యంత సమర్థవంతంగా ఎదుర్కొనే వ్యూహంలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం ఈ చర్యలను చేపడుతోంది. అదేవిధంగా కొచ్చిలో సీటెక్ సోనార్ టెస్టింగ్ కేంద్రాన్ని సైతం కొత్తగా ఏర్పాటు చేయనున్నారు. ఇది భవిష్యత్తులో భారత నౌకాదళానికి చెందిన జలాంతర్గాముల సాంకేతిక సామర్థ్యాల అభివృద్ధికి ఎంతగానో దోహదపడనుందని అధికారులు వెల్లడించారు.

అక్రమార్కులకు జైలు శిక్ష తప్పదు!

- **ఎరువుల బ్లాక్ మార్కెటింగ్‌పై కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ హెచ్చరిక**
- **నాసిరకం పురుగుమందుల అరికట్టేందుకు కొత్త చట్టం**
- **యూరియాకు ప్రత్యామ్నాయంగా గ్రీన్ అమ్మోనియా ప్రయోగాలు**
- **పంజాబ్ రైతులకు రూ.254 కోట్ల ప్రయోజనం చేకూర్చే పత్రం అందజేత**
- **వ్యవసాయ యంత్రాలపై చిన్న రైతులకు 80 శాతం సబ్సిడీ**



చండీగఢ్, నవంబర్ 18 (సమయం న్యూస్): పంజాబ్‌లో రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. పంజాబ్‌లో జరిగిన 'ఖేత్ బచావో అభియాన్'లో పాల్గొన్న కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్.. రైతులకు రూ.254.20 కోట్ల ప్రయోజనం చేకూర్చే పీఎం-ఆర్‌కేవీవై అనుమతి పత్రాన్ని రాష్ట్ర వ్యవసాయ మంత్రి గుర్మీత్ సింగ్ ఖుద్దియాన్‌కు అందజేశారు. వ్యవసాయానికి మరింత ఊతమిచ్చేలా రూ.98.44 కోట్ల విలువైన ఏడు కొత్త ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఎరువుల బ్లాక్ మార్కెటింగ్, బలవంతపు ట్యాగింగ్‌కు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, వారికి జైలు శిక్ష తప్పదని చౌహాన్ హెచ్చరించారు. నకిలీ ఎరువులు, విత్తనాలు, నాసిరకం పురుగుమందులను అరికట్టేందుకు త్వరలోనే కొత్త కఠినమైన పురుగుమందుల చట్టాన్ని తీసుకురానున్నట్లు ప్రకటించారు. యూరియాకు ప్రత్యామ్నాయంగా 10,000 ఎకరాల్లో గ్రీన్ అమ్మోనియా ప్రయోగాన్ని దేశవ్యాప్తంగా ప్రారంభించినట్లు తెలిపారు.

కొత్త ప్రాజెక్టులకు బడ్జెట్‌లో ప్రాధాన్యం..

రైతులు ఎరువులు వినియోగించే ముందు భూసార పరీక్షలు చేయించుకోవాలని మంత్రి సూచించారు. పంటల వైవిధ్యీకరణ, సమీకృత వ్యవసాయంతో చిన్న రైతుల ఆదాయాన్ని పెంచే ప్రాజెక్టులకు వచ్చే బడ్జెట్‌లో మరింత ప్రాధాన్యం ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. పంజాబ్ రైతులు మధ్యవర్తులను పక్కనపెట్టి నాణ్యమైన ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించడాన్ని చౌహాన్ అభినందించారు. చిన్న రైతుల బృందాలకు వ్యవసాయ యంత్రాలపై 80 శాతం సబ్సిడీ అందించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వాలు వేర్వేరుగా ఉండొచ్చని, కానీ రైతులకు సేవ చేయడం మనందరి ఉమ్మడి బాధ్యత అని శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు.



కోళ్ల వ్యాధుల నియంత్రణకు.. స్వదేశీ టీకా!

బర్డ్‌ఫ్లూ నియంత్రణకు తొలి స్వదేశీ హెచ్5ఎన్1 వ్యాక్సిన్

నవంబర్ 20న దేశానికి అంకితం చేయనున్న కేంద్ర మంత్రి చౌహాన్

ఐసీఏఆర్ఉజాతీయ అధిక భద్రతా జంతు వ్యాధుల సంస్థ ఆధ్వర్యంలో అభివృద్ధి

పౌల్ట్రీ రైతులకు ఆర్థిక నష్టాలు తగ్గించే దిశగా కీలక ముందడుగు

న్యూఢిల్లీ, నవంబర్ 18 (సమయం న్యూస్): భోపాల్‌లోని ఐసీఏఆర్ఉజాతీయ అధిక భద్రతా జంతు వ్యాధుల సంస్థ అభివృద్ధి చేసిన భారత తొలి స్వదేశీ నిష్క్రియాత్మక హెచ్5ఎన్1 (క్లేడ్ 2.3.2.1ఏ) టీకాను కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ నవంబర్ 20వ తేదీన దేశానికి అంకితం చేయనున్నారు. కోళ్లలో ప్రాణాంతకమైన బర్డ్‌ఫ్లూ వ్యాధిని అరికట్టేందుకు ఈ టీకా కీలకంగా ఉపయోగపడనుంది. హెచ్5ఎన్1 వైరస్ కారణంగా కోళ్లలో భారీగా మరణాలు సంభవించడంతో పాటు పౌల్ట్రీ రైతులు తీవ్ర ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్నారు. భారత్‌లో 2006 నుంచి బర్డ్‌ఫ్లూ వ్యాప్తి నమోదవుతుండగా, ఇప్పటివరకు హెచ్5ఎన్1, హెచ్5ఎన్8 రకాలతో 500కు పైగా వ్యాప్తి ఘటనలు నమోదయ్యాయి. ప్రస్తుతం క్లేడ్ 2.3.2.1ఏ హెచ్5ఎన్1 వైరస్‌కు ప్రత్యేకంగా అందుబాటులో ఉన్న వాణిజ్య టీకా ఏదీ లేకపోవడంతో, దేశీయంగా అభివృద్ధి చేసిన ఈ టీకాకు ఎంతో ప్రాధాన్యత ఏర్పడింది. ఈ స్వదేశీ టీకా ద్వారా కోళ్లలో వ్యాధి వ్యాప్తిని అరికట్టి, పౌల్ట్రీ రైతులకు కలిగే ఆర్థిక నష్టాలను తగ్గించడంతో పాటు ఇతర జంతువులు, మనుషులకు ఈ వైరస్ వ్యాప్తి చెందే ప్రమాదాన్ని తగ్గించేందుకు ఇది ఎంతగానో దోహదపడుతుందని కేంద్రం తెలిపింది.

రూ.లక్షన్నర లంచం తీసుకుంటూ.. పీపీ అరెస్ట్!

ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా చిక్కిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవీందర్

సాక్షులను అనుకూలంగా పరీక్షించి కేసు ముగించేందుకు డిమాండ్

డబ్బు అందజేసిన వ్యక్తిని సైతం అరెస్ట్ చేసిన అధికారులు

కరీంనగర్ ప్రత్యేక ఏసీబీ కోర్టులో నిందితుల హాజరు

పెద్దపల్లి, నవంబర్ 18 (సమయం న్యూస్): ఓ కేసు విచారణలో నిందితులకు అనుకూలంగా వ్యవహరించేందుకు ఏకంగా రూ.1.50 లక్షల లంచం తీసుకుంటూ పెద్దపల్లి ప్రిన్సిపల్ జిల్లా, సెషన్స్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ దొంకెన రవీందర్ ఏసీబీకి అడ్డంగా పట్టుబడ్డారు. ఆయనకు లంచం నగదు అందజేసిన రెడ్డ్యరాజుల రాజయ్యను కూడా అధికారులు అరెస్ట్ చేశారు. ఏసీబీ అధికారుల వివరాల ప్రకారం.. ధర్మారం పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన ఒక కేసులో నిందితులకు అనుకూలంగా సాక్షులను పరీక్షించి కేసు ముగించేందుకు పీపీ రవీందర్ మొదట రూ.2 లక్షలు డిమాండ్ చేశారు. చివరకు బేరసారాల తర్వాత రూ.1.50 లక్షలకు ఒప్పుకున్నారు. నిందితుల నుంచి రాజయ్య ద్వారా ఆ లంచం డబ్బు తీసుకుంటుండగా అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఇద్దరినీ కరీంనగర్ ప్రత్యేక ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. ఎవరైనా అధికారులు లంచం డిమాండ్ చేస్తే 1064 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని ఏసీబీ అధికారులు ప్రజలకు సూచించారు.





ధ్రువకుమార్‌కు గజల్ శ్రీనివాస్ ఘనసత్కారం

వేమన శతకం, భగవద్గీత శ్లోకాలు ఏకధాటిగా ఆలపించిన చిన్నారి

ఒంగోలులో జరిగే నాలుగో ప్రపంచ బాలోత్సవానికి ఆహ్వానం

నెల్లూరులో ఘనంగా సింహపురి బాలల సాహిత్య సంబరాలు

నెల్లూరు, నవంబర్ 18 (సమయం న్యూస్): ఆంధ్ర సారస్వత పరిషత్ విశ్వసాహితి కళావేదిక ఆధ్వర్యంలో బుధవారం నెల్లూరు టౌన్ హాల్‌లో నిర్వహించిన సింహపురి బాలల సాహిత్య, సాంస్కృతిక సంబరాల్లో సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో రెండో తరగతి చదువుతున్న ధ్రువకుమారరాజ్‌ను ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షులు గజల్ శ్రీనివాస్ ఘనంగా సత్కరించారు. వేమన శతకం, భగవద్గీత శ్లోకాలు, తెలుగు సాహిత్యానికి సంబంధించిన పాటలను ఏకధాటిగా ఆలపించిన ధ్రువకుమార్‌ను అభినందించి, ఒంగోలులో జరిగే నాలుగో ప్రపంచ బాలోత్సవానికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు బ్రహ్మయ్య, సతీష్ కుమార్, బలరామనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో పోటీ కోసమే శిక్షపై స్టే ఇవ్వలేం

కన్విక్షన్ స్టే సాధారణ హక్కు కాదన్న సుప్రీంకోర్టు

చట్టసభల పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత కోర్టులదే

ఆజం ఖాన్, ఆయన భార్య, కుమారుడికి భారీ ఊరట



న్యూఢిల్లీ, నవంబర్ 18 (సమయం న్యూస్) : క్రిమినల్ కేసుల్లో దోషులుగా తేలిన వ్యక్తులు కేవలం ఎన్నికల్లో పోటీ చేసేందుకు మాత్రమే తమ శిక్షపై స్టే కోరడం కుదరదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కన్విక్షన్ స్టే అనేది సాధారణ హక్కు కాదని, కేవలం అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే ఇవ్వదగిన ప్రత్యేక వెసులుబాటని తేల్చిచెప్పింది. సమాజ్‌వాదీ పార్టీ సీనియర్ నేత ఆజం ఖాన్, ఆయన కుటుంబ సభ్యుల కేసుల విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. చట్టసభల పవిత్రతను, నైతిక విలువలను కాపాడాల్సిన బాధ్యత న్యాయస్థానాలపై ఉందని, నేరస్థులు రాజకీయాల్లో కొనసాగడాన్ని తేలికగా తీసుకోలేమని ధర్మాసనం పేర్కొంది. పిటిషనర్ల రాజకీయ భవిష్యత్తు లేదా ఎన్నికల్లో పోటీ చేసే ఆకాంక్షలను బట్టి కోర్టులు తమ విచక్షణాధికారాన్ని ఉపయోగించలేవని స్పష్టం చేసింది. మరోవైపు ఆజం ఖాన్ శిక్షపై అలహాబాద్ హైకోర్టు విధించిన స్టేను రద్దు చేయాలంటూ ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. అదే సమయంలో ఆజం ఖాన్ భార్య తజీన్ ఫాత్మా, కుమారుడు అబ్దుల్లా ఆజం ఖాన్ దాఖలు చేసిన అప్పీళ్లను అనుమతించింది. హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న వారి రివిజన్ పిటిషన్లు తేలే వరకు వారి శిక్షలపైనా స్టే విధిస్తూ ధర్మాసనం భారీ ఊరట కల్పించింది.

నిర్దోషికి ఏడేళ్లు అక్రమ జైలు.. రూ.30 లక్షల పరిహారం

ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం

హైకోర్టు తీర్పు కాపీ అందక ఏడేళ్లు జైల్లోనే మగ్గిన దేవీలాల్

పరిహారానికి చట్టబద్ధ యంత్రాంగం లేకపోవడంపై ధర్మాసనం ఆందోళన

న్యూఢిల్లీ, నవంబర్ 18 (సమయం న్యూస్) : హైకోర్టు నిర్దోషిగా ప్రకటించిన తర్వాత కూడా ఏడేళ్ల పాటు జైలు గోడలకే పరిమితమైన దేవీలాల్ గోండ్ అనే వ్యక్తికి రూ.30 లక్షల పరిహారం చెల్లించాలని సుప్రీంకోర్టు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. అక్రమంగా జైలు శిక్ష అనుభవించిన వారికి పరిహారం చెల్లించేందుకు చట్టబద్ధమైన యంత్రాంగం లేకపోవడంపై ధర్మాసనం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. హత్యా నేరంపై 2012 డిసెంబర్‌లో అరెస్టయిన గోండ్‌కు సెషన్స్ కోర్టు యావజ్జీవ శిక్ష విధించగా, 2018లో హైకోర్టు అతన్ని నిర్దోషిగా ప్రకటించింది. అయితే హైకోర్టు తీర్పు కాపీ జైలు అధికారులకు చేరకపోవడంతో దేవీలాల్ విడుదల కాలేదు. ఈ వ్యవహారంపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు.. 28 ఏళ్ల వయసులో నిర్దోషిగా బయటకు రావాల్సిన వ్యక్తి తన 35వ ఏట విడుదలయ్యాడని, అత్యంత విలువైన యవ్వన కాలమంతా నిస్తేజంగా జైలు గోడల మధ్యే ఉండిపోయాడని వ్యాఖ్యానించింది.

ప్రధాని మోదీతో వేల్స్ యువరాజు, యువరాణి భేటీ

- **భారత్-బ్రిటన్ ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై చర్చ**
- **ఎర్త్‌షాట్ ప్రైజ్ కార్యక్రమాన్ని అభినందించిన ప్రధాని**
- **రక్షణ, విద్య, ఆరోగ్య రంగాల్లో సహకారంపై అభిప్రాయాల మార్పిడి**



న్యూఢిల్లీ, నవంబర్ 18 (సమయం న్యూస్): ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో వేల్స్ యువరాజు, యువరాణి బుధవారం న్యూఢిల్లీలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా భారత్‌ఉబ్రిటన్ ద్వైపాక్షిక సంబంధాల పురోగతిపై మోదీ హర్షం వ్యక్తం చేశారు. పర్యావరణ సమస్యలకు వినూత్న పరిష్కారాలను ప్రోత్సహిస్తున్న ఎర్త్‌షాట్ ప్రైజ్ కార్యక్రమాన్ని ఆయన అభినందించారు. ముంబైలో నవంబర్ 17న జరిగిన ఎర్త్‌షాట్ ప్రైజ్ అవార్డుల్లో భారతీయ ఆవిష్కర్తలను గుర్తించడం పట్ల ప్రశంసలు తెలిపారు. భారత్‌ఉబ్రిటన్ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంపై ఇరుపక్షాలు చర్చించాయి. రక్షణ, ఆరోగ్యం, విద్య, ఆర్థిక సాంకేతికత, ప్రజల మధ్య సంబంధాల వంటి రంగాల్లో సహకారంపై అభిప్రాయాలు పంచుకున్నారు. బ్రిటన్ రాజు మూడో చార్లెస్, ప్రధానమంత్రి ఆండీ బర్న్‌హామ్‌లకు ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలిపారు.

నౌకాదళ బరాక్ క్షిపణి వ్యవస్థ ఆధునీకరణ

- **ఇజ్రాయెల్ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్‌తో రూ.1,976.40 కోట్ల ఒప్పందం**
- **హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌తో పాటు కొత్త సాంకేతికత ఏర్పాటు**
- **నౌకలకు మరింత పెరగనున్న వైమానిక రక్షణ సామర్థ్యం**



న్యూఢిల్లీ, నవంబర్ 18 (సమయం న్యూస్): భారత నౌకాదళ నౌకల్లోని బరాక్ పాయింట్ డిఫెన్స్ క్షిపణి వ్యవస్థను ఆధునీకరించేందుకు ఇజ్రాయెల్ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్‌తో రక్షణ మంత్రిత్వ శాఖ రూ.1,976.40 కోట్ల ఒప్పందం కుదుర్చుకుంది. రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ సమక్షంలో బుధవారం ఈ ఒప్పందం కుదిరింది. ఇందులో భాగంగా క్షిపణి వ్యవస్థలోని హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌ను పూర్తిగా ఆధునీకరించడంతో పాటు పాతబడిన పరికరాల స్థానంలో కొత్త సాంకేతికతను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ ఆధునీకరణతో భారత నౌకాదళ నౌకలకు మరింత సమర్థవంతమైన వైమానిక రక్షణ సామర్థ్యం, మెరుగైన పనితీరు, విస్తృత పరిధి అందుబాటులోకి రానుంది.

యూపీలో సీట్ల పంచాయితీ..

- **2027 అసెంబ్లీ ఎన్నికలపై ఇండియా కూటమిలో వేడెక్కిన చర్చలు**
- **2022లో 20 వేల ఓట్లు దాటిన స్థానాలకే ఎస్పీ ప్రతిపాదన**
- **ఈనెల 23 నుంచి 25 వరకు ఢిల్లీలో ఇరు పార్టీల భేటీ**
- **ప్రియాంక, వేణుగోపాల్ నేతృత్వంలో కాంగ్రెస్ కమిటీ ఏర్పాటు**



లక్నో, నవంబర్ 18 (సమయం న్యూస్) : ఉత్తరప్రదేశ్ 2027 అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండటంతో ఇండియా కూటమిలోని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), కాంగ్రెస్ మధ్య సీట్ల పంపకాల వ్యవహారం వేడెక్కుతోంది. రాష్ట్రంలోని మొత్తం 403 అసెంబ్లీ స్థానాల్లో తమకు 181 సీట్లు కేటాయించాలని కాంగ్రెస్ ఇప్పటికే జాబితా సమర్పించినట్లు సమాచారం కాగా, అఖిలేశ్ యాదవ్ నేతృత్వంలోని ఎస్పీ మాత్రం కేవలం 24 స్థానాలే ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. 2022 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు 20 వేలకు పైగా ఓట్లు సాధించిన 21 నియోజకవర్గాలు, ఆ మార్కుకు చేరువగా వచ్చిన మరో మూడు స్థానాలను ప్రాతిపదికగా తీసుకుని 24 సీట్లతో చర్చలు ప్రారంభించాలని ఎస్పీ భావిస్తోంది. 2022లో ఒంటరిగా పోటీ చేసిన కాంగ్రెస్ కేవలం రెండు స్థానాలకే పరిమితం కాగా, ఎస్పీ 111 స్థానాల్లో గెలిచింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌కు ఎక్కువ సీట్లు ఇస్తే మొదటికే మోసం వస్తుందని ఎస్పీ నేతలు అంచనా వేస్తున్నారు.

ఢిల్లీలో చర్చలకు కమిటీలు సిద్ధం

సీట్ల సర్దుబాటుపై చర్చించేందుకు ఇరు పార్టీలు ప్రత్యేక కమిటీలను సిద్ధం చేస్తున్నాయి. కాంగ్రెస్ తరఫున ప్రియాంక గాంధీ వాద్రా, కేసీ వేణుగోపాల్ సహా ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. మరోవైపు ఎస్పీ కూడా ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తోందని, ఈనెల 23, 24, 25 తేదీల్లో ఆ బృందం ఢిల్లీలో కాంగ్రెస్ నేతలతో చర్చలు జరిపే అవకాశముందని ఎస్పీ ఎంపీ రాజీవ్ రాయ్ వెల్లడించారు. ఇరు పార్టీల ప్రతిపాదనల మధ్య భారీ వ్యత్యాసం ఉన్న నేపథ్యంలో సీట్ల సర్దుబాటు అంత సులభంగా సాగేలా కనిపించడం లేదు.

'ఛలో ఢిల్లీ' ర్యాలీని జయప్రదం చేయండి

డిసెంబర్ 12న రాంలీలా మైదానంలో కర్మచారి ఆక్రోశ్ ర్యాలీ

విజయవాడలో పోస్టర్ ఆవిష్కరించిన ఏపీఎన్జీవో అధ్యక్షుడు విద్యాసాగర్

విజయవాడ, నవంబర్ 18 (సమయం న్యూస్) : ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఏఐఎస్‌జీఈఎఫ్) ఆధ్వర్యంలో 2026 డిసెంబర్ 12న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో నిర్వహించనున్న 'ఛలో ఢిల్లీ కర్మచారి ఆక్రోశ్ ర్యాలీ'ని జయప్రదం చేయాలని ఏపీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు, ఏఐఎస్‌జీఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎ. విద్యాసాగర్ పిలుపునిచ్చారు. రాష్ట్రం నుంచి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో ఈ ర్యాలీకి తరలిరావాలని కోరారు. ఈ మేరకు బుధవారం విజయవాడలో కర్మచారి ఆక్రోశ్ ర్యాలీకి సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.



కేకేఆర్ వాటా విక్రయానికి రంగం సిద్ధం



- 400 మిలియన్ డాలర్లకు భారీ డీల్!
- 22.5 శాతం వాటాను విక్రయించేందుకు జయ్ మెహతా సన్నాహాలు
- అమెరికా పెట్టుబడుల సంస్థ ఎరెస్ మేనేజ్‌మెంట్‌తో చర్చలు

ఐపీఎల్ ఫ్రాంచైజీ కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) సహ-యజమాని జయ్ మెహతా తన 45 శాతం వాటాలో సగం, అంటే 22.5 శాతం వాటాను విక్రయించేందుకు సిద్ధమయ్యారు. అమెరికాకు చెందిన ప్రముఖ పెట్టుబడుల సంస్థ ఎరెస్ మేనేజ్‌మెంట్‌తో సుమారు 400 మిలియన్ డాలర్లకు (రూ. 3,300 కోట్లకు పైగా) ఈ భారీ నగదు ఒప్పందం జరగనుంది.

ముంబై/కోల్‌కతా, నవంబర్ 18 (సమయం న్యూస్): ఐపీఎల్ ఫ్రాంచైజీ కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) యాజమాన్యంలో కీలక మార్పు చోటుచేసుకోనుంది. జట్టు సహ-యజమాని జయ్ మెహతా కేకేఆర్‌లో తనకున్న 45 శాతం వాటాలో సగం, అంటే 22.5 శాతం వాటాను విక్రయించేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. అమెరికాకు చెందిన ప్రముఖ పెట్టుబడుల సంస్థ 'ఎరెస్ మేనేజ్‌మెంట్'కు ఈ వాటాను విక్రయించనున్నారు. ఈ ఒప్పందం విలువ సుమారు 400 మిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో సుమారు రూ. 3,300 కోట్లకు పైగా) ఉంటుందని సమాచారం. ఈ డీల్ ప్రకారం కేకేఆర్ జట్టు మొత్తం విలువను 1.78 బిలియన్ డాలర్లుగా (సుమారు రూ. 16,634 కోట్లు) నిర్ణయించారు. ఇటీవల రాజస్థాన్ రాయల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల విక్రయాల విలువలకు అనుగుణంగానే కేకేఆర్ విలువ కూడా నమోదవడం విశేషం.

బీసీసీఐ అనుమతి తప్పనిసరి.. 5 శాతం రుసుము చెల్లింపు:

బాలీవుడ్ అగ్ర నటుడు షారుఖ్ ఖాన్‌కు కేకేఆర్‌లో 55 శాతం వాటా ఉండగా, జయ్ మెహతా, ఆయన భార్య, ప్రముఖ నటి జూహీ చావ్లాకు కలిపి 45 శాతం వాటా ఉంది. వీరంతా కలిసి 2007లో ఈ జట్టును కొనుగోలు చేశారు. తాజా వాటా విక్రయ ఒప్పందం పూర్తిగా నగదు రూపంలో జరగనుంది. అయితే, ఈ వాటా బదిలీకి భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అధికారిక అనుమతి తప్పనిసరి. నిబంధనల ప్రకారం, కొత్త పెట్టుబడిదారు నేపథ్యాన్ని బీసీసీఐ క్షుణ్ణంగా పరిశీలించనుంది. అంతేకాకుండా, ఈ ఒప్పందం మొత్తం విలువలో 5 శాతం అంటే సుమారు 20 మిలియన్ డాలర్లు (దాదాపు రూ. 200 కోట్లు) బీసీసీఐకి రుసుముగా చెల్లించాల్సి ఉంటుంది. 2022లో సీవీసీ క్యాపిటల్ సంస్థ గుజరాత్ టైటాన్స్ జట్టును కొనుగోలు చేసినప్పటి నుంచి ఐపీఎల్ ఫ్రాంచైజీలపై అమెరికా పెట్టుబడి సంస్థల ఆసక్తి బాగా పెరిగింది. ఆర్సీబీ జట్టులో కూడా బ్లాక్‌స్టోన్, బోల్ట్ వెంచర్స్ వంటి అమెరికా సంస్థలు పెట్టుబడులు పెట్టాయి. ప్రస్తుతం కేకేఆర్ వాటాను కొనుగోలు చేస్తున్న ఎరెస్ మేనేజ్‌మెంట్‌కు క్రీడా రంగంలో పెట్టుబడులు పెట్టడం కొత్తేమీ కాదు. ఈ సంస్థకు ఇంగ్లీష్ ప్రీమియర్ లీగ్‌లో ప్రఖ్యాత చెల్సీ ఎఫ్‌సీ, ఎన్ఎఫ్ఎల్‌లో మయామి డాల్ఫిన్స్ జట్లలో వాటాలు ఉన్నాయి. అంతేకాకుండా, ఇంగ్లాండ్‌లో జరిగే 'ది హండ్రెడ్' లీగ్‌లోని ట్రెంట్ రాకెట్స్ జట్టుకు కూడా సహ-యజమానిగా వ్యవహరిస్తోంది. మూడుసార్లు ఐపీఎల్ ట్రోఫీని ముద్దాడిన కేకేఆర్ జట్టులో జరుగుతున్న ఈ వాటా మార్పు క్రీడా, వాణిజ్య వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.



భారత్‌తో తొలి టెస్టు

కివీస్ కెప్టెన్ కీలక ప్రకటన!

న్యూఢిల్లీ, నవంబర్ 18 (సమయం న్యూస్): భారత్‌తో రెండు టెస్టుల సిరీస్‌కు ముందు న్యూజిలాండ్ కెప్టెన్ టామ్ లాథమ్ తమ జట్టు కూర్పుపై కీలక విషయాలు వెల్లడించాడు. తొలి టెస్టులో ముగ్గురు ఫాస్ట్ బౌలర్లు, ఒక బౌలింగ్ ఆల్‌రౌండర్‌తో బరిలోకి దిగనున్నట్లు స్పష్టం చేశాడు. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలో స్థానాల గురించి ఆలోచించకుండా తమదైన శైలిలో క్రికెట్ ఆడటంపైనే దృష్టి సారిస్తామని తెలిపాడు. తొలి టెస్టుకు ముందు నిర్వహించిన మీడియా సమావేశంలో లాథమ్ మాట్లాడాడు. న్యూజిలాండ్ పేస్ దళంలో మాట్ హెన్రీ, కైల్ జేమీసన్ కీలక పాత్ర పోషించనున్నట్లు లాథమ్ వెల్లడించాడు. మూడో పేసర్ ఎవరనే విషయంపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. ఇటీవల భారత్‌తో జరిగిన పరిమిత ఓవర్ల సిరీస్‌లో కంకషన్‌కు గురైన హెన్రీ పూర్తిగా కోలుకున్నాడని తెలిపాడు. 'హెన్రీ పూర్తి ఫిట్‌నెస్‌తో ఉన్నాడు. టెస్టు క్రికెట్‌లో రాణించేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాడు' అని పేర్కొన్నాడు. జేమీసన్ కూడా గత రెండు వారాలుగా తీవ్రంగా శ్రమిస్తున్నాడని, పరిమిత ఓవర్ల మ్యాచ్‌ల్లో అతడి బౌలింగ్ ఆకట్టుకుందని ప్రశంసించాడు. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికపై స్పందించిన లాథమ్ ప్రస్తుతం తమ దృష్టంతా భారత్‌తో సిరీస్‌పైనే ఉందన్నాడు. డబ్ల్యూటీసీ ప్రస్తుత చక్రంలో ఆరు టెస్టులు ఆడి నాలుగు విజయాలతో న్యూజిలాండ్ అగ్రస్థానంలో ఉండగా, భారత్ నాలుగో స్థానంలో కొనసాగుతున్నట్లు పేర్కొన్నాడు. అయితే పట్టికలో స్థానాల కంటే మైదానంలో మెరుగైన ప్రదర్శన చేయడమే ముఖ్యమని స్పష్టం చేశాడు. 'మా నియంత్రణలో ఉన్న అంశాలపైనే దృష్టి పెడతాం. మా ఆటతీరుకు అనుగుణంగా అవకాశాలను సృష్టించుకుని విజయాలు సాధించేందుకు ప్రయత్నిస్తాం' అని లాథమ్ వివరించాడు.

కొన్ని అధ్యాయాలు ముగియాల్సిందే..

- ధోనీ వీడ్కోలుపై సాక్షి భావోద్వేగం!
- ఐపీఎల్‌కు మహీ వీడ్కోలు పలికినట్లు వార్తలు
- కొత్త ప్రయాణానికి స్వాగతం అంటూ భార్య సాక్షి సందేశం



చెన్నై, నవంబర్ 18 (సమయం న్యూస్): భారత క్రికెట్ దిగ్గజం మహేంద్రసింగ్ ధోనీ ఐపీఎల్‌కు వీడ్కోలు పలికినట్లు వెలువడుతున్న వార్తలు అభిమానులను భావోద్వేగానికి గురిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన భార్య సాక్షి సింగ్ ధోనీ సామాజిక మాధ్యమాల్లో పంచుకున్న సందేశం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. 'కొన్ని అందమైన కొత్త అధ్యాయాలు ప్రారంభం కావాలంటే కొన్ని అధ్యాయాలు ముగియాల్సి ఉంటుంది' అంటూ ఆమె చేసిన పోస్ట్ చర్చనీయాంశమైంది. ఇన్నేళ్లుగా ధోనీని ప్రేమించి, ప్రోత్సహించి, అండగా నిలిచిన అభిమానులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. 'కొత్త ప్రారంభాలు, కొత్త ప్రయాణాలు, మరెన్నో మధుర జ్ఞాపకాలకు స్వాగతం. నీ గురించి ఎంతో గర్వంగా ఉంది మహీ' అంటూ భావోద్వేగంతో పేర్కొన్నారు. సాక్షి తన సందేశంతోపాటు పచ్చని కొండలు, మంచుతో కప్పుకున్న పర్వతాల మధ్య ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్న ధోనీ ఫొటోను పంచుకున్నారు. ఈ పోస్ట్‌పై అభిమానులు పెద్దఎత్తున స్పందిస్తున్నట్లు సమాచారం. చెన్నై సూపర్ కింగ్స్ అధికారిక సామాజిక మాధ్యమ ఖాతా కూడా ధోనీపై గర్వాన్ని వ్యక్తం చేస్తూ స్పందించినట్లు కథనాలు వెలువడ్డాయి. చెన్నై సూపర్ కింగ్స్ జట్టు యాజమాన్యంతో జరిగిన వీడియో సమావేశంలో ధోనీ తన నిర్ణయాన్ని వెల్లడించినట్లు జట్టు సహ యజమాని రూప గురునాథ్ తెలిపారని కథనాలు పేర్కొంటున్నాయి. వచ్చే సీజన్ కోసం విడుదల చేసే ఆటగాళ్ల జాబితాను పరిశీలిస్తున్న సమయంలో తన పేరును కూడా చేర్చాల్సి రావచ్చని ధోనీ వ్యాఖ్యానించినట్లు సమాచారం. జట్టుకు పూర్తిస్థాయిలో న్యాయం చేయలేనని భావిస్తే ధోనీ ఆట కొనసాగించరని రూప పేర్కొన్నట్లు తెలుస్తోంది. 2008 నుంచి చెన్నై సూపర్ కింగ్స్‌కు ప్రధాన ఆధారంగా నిలిచిన ధోనీ తన నాయకత్వంలో జట్టుకు ఐదు ఐపీఎల్ టైటిళ్లు, రెండు చాంపియన్స్ లీగ్ టీ20 ట్రోఫీలు అందించారు. చెన్నైని పదిసార్లు ఐపీఎల్ ఫైనల్‌కు చేర్చిన ఆయన 2020 ఆగస్టులో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికారు. ఇప్పుడు ఐపీఎల్ నుంచి కూడా తప్పుకుంటున్నారన్న వార్తలతో అభిమానులు ఆయన అద్భుతమైన క్రికెట్ ప్రస్థానాన్ని గుర్తుచేసుకుంటున్నారు.



బాల్ ట్యాంపరింగ్ అందరికీ తెలుసు..

ఆసీస్ బండారం బయటపెట్టిన బ్యాన్‌క్రాఫ్ట్!

కేప్‌టౌన్, నవంబర్ 18 (సమయం న్యూస్): ప్రపంచ క్రికెట్‌ను కుదిపేసిన 2018 కేప్‌టౌన్ బాల్ ట్యాంపరింగ్ వివాదం మరోసారి చర్చనీయాంశమైంది. దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టులో సాండ్‌పేపర్‌తో బంతి ఆకారాన్ని మార్చేందుకు ప్రయత్నించి పట్టుబడిన ఆస్ట్రేలియా క్రికెటర్ కెమెరాన్ బ్యాన్‌క్రాఫ్ట్ ఎనిమిదేళ్ల తర్వాత సంచలన ఆరోపణలు చేశారు. ఈ వ్యవహారం తనకు, డేవిడ్ వార్నర్‌కు మాత్రమే పరిమితం కాదని, జట్టు కోచ్‌లు, ప్రధాన బౌలర్లకు కూడా ముందే తెలుసని పేర్కొన్నారు. మ్యాచ్‌లో ఆధిపత్యం సాధించాలనే ఒత్తిడిలో భాగంగా వార్నర్ ఈ ఆలోచన చేశారని, జట్టులో కొత్తవాడినైన తనతో ఆ పని చేయించారని వెల్లడించారు. జట్టులో స్థానం సుస్థిరం చేసుకోవాలనే ఉద్దేశంతో తప్పని తెలిసినా అంగీకరించానని బ్యాన్‌క్రాఫ్ట్ వివరించారు. ప్రధాన కోచ్ డారెన్ లీమన్, బౌలింగ్ కోచ్ డేవిడ్ సాకర్‌తోపాటు పలువురు బౌలర్లకు ఈ వ్యవహారంపై అవగాహన ఉందని ఆరోపించారు. పాట్ కమిన్స్, మిచెల్ స్టార్క్, జోష్ హాజిల్‌వుడ్, మిచెల్ మార్ష్, టిమ్ పెయిన్ పేర్లను కూడా ప్రస్తావించారు. బంతి రివర్స్ స్వింగ్ అవుతున్న తీరుపై వారు తనతో మాట్లాడేవారని పేర్కొన్నారు. తన కదలికలు కెమెరాలకు చిక్కే ప్రమాదం ఉందని కోచ్ లీమన్ హెచ్చరించారని తెలిపారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత వ్యక్తుల స్పందన తెలియాల్సి ఉంది. మైదానంలో సాండ్‌పేపర్ ఉపయోగిస్తూ కెమెరాలకు చిక్కిన తర్వాత అసలు విషయాన్ని బయటపెట్టవద్దని జట్టు మేనేజ్‌మెంట్ ఒత్తిడి తెచ్చిందని బ్యాన్‌క్రాఫ్ట్ ఆరోపించారు. సాండ్‌పేపర్ బదులుగా టేప్, మట్టి ఉపయోగించినట్లు చెప్పాల్సి వచ్చిందన్నారు. 2021లో బౌలర్లకు ఈ వ్యవహారం తెలుసా అనే ప్రశ్నకు తాను ఇచ్చిన సమాధానం తర్వాత వారు తమకేమీ తెలియదని ప్రకటనలు చేయడం బాధించిందని పేర్కొన్నారు. శిక్ష పూర్తయిన తర్వాత దేశవాళీ క్రికెట్‌లో రాణించినప్పటికీ తిరిగి జాతీయ జట్టులో అవకాశం దక్కలేదని బ్యాన్‌క్రాఫ్ట్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వివాదంలో తప్పుల భారాన్ని తానొక్కడినే మోస్తున్నానని, ఉస్మాన్ ఖ్వాజా పుస్తకం విడుదలైన నేపథ్యంలో అసలు విషయాలను అభిమానులకు తెలియజేయాలనే ఉద్దేశంతో మాట్లాడుతున్నానని చెప్పారు. బ్యాన్‌క్రాఫ్ట్ తాజా ఆరోపణలతో ఆస్ట్రేలియా క్రికెట్‌లో బాల్ ట్యాంపరింగ్ వివాదం మళ్లీ తెరపైకి వచ్చింది.

ఆసీస్‌ను చిత్తు చేసిన ఇంగ్లండ్

- వన్డే సిరీస్ కైవసం!
- నిర్ణయాత్మక పోరులో 97 పరుగుల భారీ విజయం
- మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-1తో సొంతం చేసుకున్న ఇంగ్లండ్



హోబర్ట్, నవంబర్ 18 (సమయం న్యూస్): ఇంగ్లండ్ క్రికెట్ జట్టు ఆస్ట్రేలియాను దాని సొంతగడ్డపైనే ఓడించి చారిత్రాత్మక విజయాన్ని అందుకుంది. ఇరు జట్ల మధ్య జరిగిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను ఇంగ్లండ్ 2-1 తేడాతో కైవసం చేసుకుంది. హోబర్ట్ వేదికగా జరిగిన చివరి, నిర్ణయాత్మక మూడో వన్డేలో ఇంగ్లండ్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టి, ఆస్ట్రేలియాను 97 పరుగుల భారీ తేడాతో మట్టికరిపించింది. ఈ నిర్ణయాత్మక మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఇంగ్లండ్ జట్టు ముందుగా బ్యాటింగ్ ఎంచుకుంది. ఆ జట్టు ఓపెనర్ బెన్ డకెట్ అద్భుతమైన శతకంతో చెలరేగడంతో నిర్దిష్ట ఓవర్లలో ఇంగ్లండ్ 328 పరుగుల భారీ స్కోరు సాధించింది. బెన్ డకెట్ 115 బంతుల్లో 15 ఫోర్లు, 3 సిక్సర్లతో 133 పరుగులు బాది ఇన్నింగ్స్‌కు వెన్నెముకగా నిలిచాడు. అతనికి తోడుగా విల్ జాక్స్ 59 పరుగులు, టోమ్ బాంటన్ 44 పరుగులతో రాణించడంతో ఇంగ్లండ్ పటిష్ట స్థితికి చేరుకుంది. ఆస్ట్రేలియా బౌలర్లలో జాక్ ఎడ్వర్డ్స్ నాలుగు వికెట్లు పడగొట్టగా, మాట్ రెన్షా మూడు వికెట్లు దక్కించుకున్నాడు. అనంతరం 329 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా జట్టు ఆరంభం నుంచే ఒత్తిడికి లోనైంది. ఇంగ్లండ్ బౌలర్లు అత్యంత కట్టుదిట్టంగా బౌలింగ్ చేస్తూ ఆసీస్ బ్యాటర్లను కట్టడి చేయడంతో ఆ జట్టు కేవలం 231 పరుగులకే కుప్పకూలింది. ఆసీస్ తరఫున మాట్ రెన్షా 55 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలవగా, అలెక్స్ కేరీ 37 పరుగులు చేశాడు. మిగతా బ్యాటర్లు ఎవరూ పెద్దగా రాణించలేకపోయారు. ఇంగ్లండ్ బౌలర్లలో సన్నీ బేకర్ నాలుగు వికెట్లు నేలకూల్చగా, లియామ్ డాసన్ మూడు వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. కెప్టెన్ హ్యారీ బ్రూక్ చక్కటి వ్యూహాలతో జట్టును విజయతీరాలకు చేర్చాడు. సెంచరీతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన బెన్ డకెట్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.



నేడు నా కల నిజమవుతోంది!

భావోద్వేగంతో యువ కథానాయిక శివాత్మిక రాజశేఖర్

హైదరాబాద్, నవంబర్ 18 (సమయం న్యూస్): 'నాకు సినిమాలంటే పిచ్చి.. రేపు నా కల నిజమవుతోంది' అంటూ యువ కథానాయిక శివాత్మిక రాజశేఖర్ భావోద్వేగానికి లోనయ్యారు. ఆమె కీలక పాత్రలో నటించిన 'ఈ నగరానికి ఏమైంది రిపీట్' చిత్రం నవంబర్ 19న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్న నేపథ్యంలో సామాజిక మాధ్యమాల్లో ఆసక్తికర పోస్ట్ పెట్టారు. సినిమాలో తాను పోషించిన 'కీర్తన' పాత్రపై ఉన్న ప్రేమను, సినిమా విడుదల కోసం ఎదురుచూస్తున్న ఉత్సాహాన్ని అభిమానులతో పంచుకున్నారు. 'ఇది కలేం కాదు మా.. రేపు నా కల నిజమవుతోంది. నవంబర్ 19 నుంచి మా సినిమా థియేటర్లలో సందడి చేయబోతోంది. ఈ చిత్రం మీ అందరికీ నచ్చుతుందని, నన్ను కూడా ఆదరిస్తారని ఆశిస్తున్నాను' అంటూ శివాత్మిక పేర్కొన్నారు. ఇకపై ప్రతి శుక్రవారం కొత్త కథలతో ప్రేక్షకులను థియేటర్లలో కలుస్తూనే ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. 'ఎందుకంటే.. నాకు సినిమాలంటే పిచ్చి!' అంటూ తన పోస్ట్‌ను ముగించారు. యువతను విశేషంగా ఆకట్టుకున్న 'ఈ నగరానికి ఏమైంది' చిత్రానికి కొనసాగింపుగా వస్తున్న ఈ సినిమాపై సినీ ప్రియుల్లో ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా శివాత్మిక పోషించిన కీర్తన పాత్ర ఎలా ఉండబోతోందనే చర్చ జరుగుతోంది. సినిమాలపై ఆమెకున్న అభిమానాన్ని ప్రతిబింబించేలా చేసిన పోస్ట్ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. మరి ఈ చిత్రంతో శివాత్మిక ప్రేక్షకులను ఏ స్థాయిలో మెప్పిస్తారో చూడాలి.

ఫులేరా గ్రామానికి మళ్లీ స్వాగతం

కొత్త సీజన్‌తో 'పంచాయత్' సందడి!


డిసెంబర్ 3 నుంచి అమెజాన్ ప్రైమ్‌లో ఐదో సీజన్



హైదరాబాద్, నవంబర్ 18 (సమయం న్యూస్): గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కి దేశవ్యాప్తంగా ప్రేక్షకుల విశేష ఆదరణ పొందిన మోస్ట్ అవేటెడ్ కామెడీ వెబ్ సిరీస్ 'పంచాయత్' సీజన్ 5 త్వరలోనే అలరించడానికి సిద్ధమవుతోంది. డిసెంబర్ 3న ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ కొత్త సీజన్ గ్రాండ్‌గా స్ట్రీమింగ్ కానుంది. ఫులేరా గ్రామ ఎన్నికల రాజకీయాలు, ఆ తర్వాత చోటుచేసుకునే ఊహించని పరిణామాలు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించడంతో పాటు ఉత్కంఠను పంచనున్నాయి. ఈ తాజా సీజన్‌లో జితేంద్ర కుమార్ (అభిషేక్), రఘుబీర్ యాదవ్ (ప్రధాన్ జీ), నీనా గుప్తా (మంజు దేవి), అశోక్ పాఠక్ తదితరులు తమ సహజ నటనతో మరోసారి మ్యాజిక్ చేయనున్నారు. గత సీజన్ ముగింపులో ఫులేరా గ్రామ రాజకీయాల్లో ఊహించని భూకంపమే సంభవించింది. దశాబ్దాలుగా గ్రామ రాజకీయాలను శాసించిన ప్రధాన్ జీ, ఆయన భార్య మంజు దేవి ఎన్నికల్లో ఊహించని ఓటమిని చవిచూశారు. వారి స్థానంలో ప్రత్యర్థి క్రాంతి దేవి గ్రామ కొత్త ప్రధాన్‌గా పగ్గాలు చేపట్టగా, ఆమె భర్త భూషణ్ అలియాస్ 'బన్‌రాకాస్' తెరవెనుక చక్రం తిప్పుతూ మరింత పవర్‌ఫుల్‌గా మారారు. కొత్త పాలకుల రాకతో గ్రామ కార్యదర్శి అభిషేక్‌కు అసలైన కష్టాలు మొదలవుతాయి. ప్రతీకార ధోరణితో వ్యవహరించే కొత్త నాయకత్వం మధ్య సచివ్ జీ అభిషేక్ పడే పాట్లు ప్రేక్షకులకు కడుపుబ్బా నవ్వులు పూయించనున్నాయి. మరోవైపు, తన కల అయిన ఎంబీఏ పూర్తి చేయడానికి సిద్ధమవుతున్న అభిషేక్.. గ్రామంలో ఇంకా ఏయే సమస్యలకు ముగింపు పలుకుతాడు? అధికార పీఠం దక్కించుకున్న బన్‌రాకాస్ అల్లరి ఏ స్థాయిలో ఉంటుంది? అన్న ఆసక్తికర అంశాలతో ఐదవ సీజన్ ఆద్యంతం వినోదాత్మకంగా సాగనుంది. మొదటి సీజన్ నుంచి వరుసగా నాలుగు సీజన్ల పాటు అద్భుత విజయాన్ని అందుకున్న 'పంచాయత్' సిరీస్, డిసెంబర్ 3న రాబోతున్న కొత్త సీజన్‌తో మరింత వినోదాన్ని పంచేందుకు సిద్ధమైంది.

బ్లాక్ డ్రెస్‌లో మౌనీ రాయ్ గ్లామర్ షో!

ముంబై, నవంబర్ 18 (సమయం న్యూస్): బాలీవుడ్ అందాల తార మౌనీ రాయ్ మరోసారి తన గ్లామర్‌తో ఆకట్టుకుంటున్నారు. నల్లటి దుస్తుల్లో ఆమె స్టైలిష్ లుక్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. అందం, అభినయంతోపాటు ఫ్యాషన్‌లోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న మౌనీ రాయ్ విభిన్నమైన దుస్తులతో అభిమానుల దృష్టిని ఆకర్షిస్తుంటారు. బుల్లితెర నుంచి వెండితెరకు ఎదిగిన మౌనీ రాయ్ తన నటనతోపాటు ఫ్యాషన్ అభిరుచితోనూ గుర్తింపు పొందారు. సంప్రదాయ దుస్తులైనా, ఆధునిక వస్త్రధారణైనా తనదైన శైలిలో కనిపించడం ఆమె ప్రత్యేకత. తాజాగా బ్లాక్ డ్రెస్‌లో ఆమె గ్లామరస్ లుక్ అభిమానులను ఆకట్టుకుంటోంది. సినిమాలు, ఫ్యాషన్ రంగాల్లో తన ప్రత్యేకతను చాటుకుంటూ మౌనీ రాయ్ ముందుకు సాగుతున్నారు.





ఎన్టీఆర్, అనిల్ రావిపూడి సినిమా టైటిల్ అదేనా?

తన తాత ఎన్టీఆర్ నటించిన ఆల్‌టైమ్ క్లాసిక్ 'లవకుశ' టైటిల్ కలిసొచ్చేలా 'జైలవకుశ' సినిమా చేసి బ్లాక్‌బస్టర్ అందుకున్నారు జూనియర్ ఎన్టీఆర్. ఇప్పుడు ఆ ఫీట్‌ని రిపీట్ చేస్తూ, మళ్లీ తాత ఎన్టీఆర్ టైటిల్ కలిసొచ్చేలా మరో సినిమా చేయనున్నారట తారక్. ఆల్‌టైమ్ క్లాసిక్ 'దానవీరశూరకర్ణ' టైటిల్ కలిసొచ్చేలా.. 'దానవీరశూర' పేరుతో తారక్ సినిమా చేయనున్నట్టు ఫిల్మ్ వర్గాల్లో ఓ వార్త బలంగా వినిపిస్తున్నది. ప్రస్తుతం ఎన్టీఆర్ 'డ్రాగన్' సినిమా చేస్తూ బిజీగా ఉన్న విషయం తెలిసిందే. ఈ సినిమా తర్వాత ఆయన అనిల్ రావిపూడి దర్శకత్వంలో సినిమా చేయనున్నట్లు ఇటీవలే ప్రకటించారు. ఆ సినిమాకే 'దానవీరశూర' టైటిల్ అనుకుంటున్నారట. అయితే.. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సివున్నది.



టాలీవుడ్ నటికి సైబర్ షాక్..

4.14 లక్షలు స్వాహా!

విమాన టికెట్ల బుకింగ్ పేరుతో అనితా చౌదరికి టోకరా

హైదరాబాద్, నవంబర్ 18 (సమయం న్యూస్): ప్రముఖ టాలీవుడ్ నటి అనితా చౌదరి సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకున్నారు. అమెరికా వెళ్లేందుకు విమాన టికెట్లు బుక్ చేసుకునే ప్రయత్నంలో ఏకంగా రూ. 4.14 లక్షలు పోగొట్టుకున్నారు. వాషింగ్టన్ డీసీలో నివసిస్తున్న తన కుమారుడి పుట్టినరోజు వేడుకలకు హాజరయ్యేందుకు ఈ నెల 12న ఆమె ఆన్‌లైన్‌లో బిజినెస్ క్లాస్ విమాన టికెట్ల కోసం వెతికారు. ఈ క్రమంలో ఓ ట్రావెల్స్ సంస్థ పేరుతో కనిపించిన వెబ్‌సైట్‌లోని ఫోన్ నంబర్‌ను సంప్రదించగా రాజేశ్ అనే వ్యక్తి మాట్లాడాడు. వాషింగ్టన్ డీసీకి వెళ్లి తిరిగి వచ్చేందుకు బిజినెస్ క్లాస్ టికెట్ల ధర రూ. 4,14,180 అవుతుందని నమ్మించాడు. టికెట్ల బుకింగ్ కోసం డెబిట్ కార్డు వివరాలు కావాలంటూ ఓ ఫారం పంపించాడు. అనంతరం ఫోన్‌లో మాట్లాడుతూ ఆమె మొబైల్‌కు వచ్చిన ఓటీపీని కూడా అడిగి తెలుసుకున్నాడు. బుకింగ్ ప్రక్రియలో భాగంగానే ఓటీపీ అడుగుతున్నాడని భావించిన అనితా చౌదరి ఆ వివరాలను వెల్లడించారు. కొద్దిసేపటికే ఆమె బ్యాంకు ఖాతా నుంచి రూ. 4.14 లక్షలు బదిలీ అయ్యాయి. నగదు కట్ అయినట్లు సందేశం వచ్చినప్పటికీ విమాన టికెట్ల బుకింగ్‌కు సంబంధించిన ఎలాంటి ధ్రువీకరణ రాకపోవడంతో మోసపోయినట్లు అనితా చౌదరి గుర్తించారు. వెంటనే బ్యాంకు వినియోగదారుల సేవా కేంద్రాన్ని సంప్రదించి ఫిర్యాదు చేశారు. అనంతరం సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



Printed, Published by **Mohammed Murthuza.** Printed at NUTAN OFFSET PRINTERS, R.S.NO. 434, PLOT NO 16,17, AUTO NAGAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520007. Ediotr: **MOHAMMED MURTHUZA,** PRGI No:APTEL/26/A3949, www.samayam.net Mobile No. **7036644111, 9490140565**